
ఆంధ్రజ్యోతి ****

ANDHRAJYOTHY



నల్లగొండ

శుక్రవారం 11 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్లు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.152	225	255
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.5 | కనిష్ఠం 24.4

ఎండ




ఎండ వేడిమితో నిర్మానుష్యంగా మారిన యాదగిరిగుట్ట దివ్యక్షేత్రం

గురువారం ఉష్ణోగ్రత మండలం	గరిష్ఠం (డిగ్రీల్లో)
అడ్డగూడూరు	40.9
నారాయణపురం	40.8
ఆత్మకూరు(ఎం)	40.7
బొమ్మలరామారం	40.5
గుండాల	40.5
మోత్కూరు	40.4
మోటకొండూరు	40.4
చౌటుప్పల్‌లో	40.4
రామన్నపేటలో	40.3
ఆలేరులో	40.1
బీబీనగర్‌లో	40.1
పోచంపల్లిలో	40.1
వలిగొండలో	40
యాదగిరిగుట్ట	39.9
రాజపేట	39.9
భువనగిరి	39.9
తుర్కపల్లి	39.9

యాదాద్రి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు రోజురోజుకూ అనూహ్యంగా పెరుగుతున్నాయి. జిల్లా ఎల్లో జోన్ నుంచి అలెర్ట్ జోన్‌కు చేరుకుంటోంది. వాతావరణ శాఖ ప్రకారం 35 నుంచి 40 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఎల్లో జోన్ కాగా, 40 నుంచి 45 డిగ్రీలు నమోదైన పక్షంలో అలెర్ట్ (అప్రమత్తం)జోన్‌గా ప్రకటిస్తారు. అయితే ఏప్రిల్ నెలలో జిల్లాలోని పలు మండలాల్లో 38 డిగ్రీల నుంచి 40డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఈ సీజన్‌లో మొదటిసారిగా ఏప్రిల్ రెండోవారంలోనే అలెర్ట్ జోన్ పరిధిలోకి చేరింది. జిల్లాలో బుధవారం వరకు 39 డిగ్రీలకుపైగా వరకు నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు గురువారం జిల్లాలోని పలు మండలాల్లో 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు మండుతున్నాయి. మేనెలలో పెరిగే ఎండలు ఈ సారి ముందస్తుగానే మండుతున్నాయి. వేడి గాలులకు వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్ రెండోవారంలోనే ఎండలు ఈ విధంగా ఉంటే.. ఇక మే నెలలో ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో లేనివిధంగా ఈసారి 44 డిగ్రీలకుపైగానే నమోదు కానున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

వాన



జిల్లా కేంద్రంలో మబ్బులు పట్టి మెరుస్తున్న ఆకాశం

గురువారం వర్షపాతం మండలం	(మి.మీ.లో)
గుర్రంపోడు	28.8
కొండమల్లేపల్లి	12.5
నల్లగొండ	17.3
పీఏ.పల్లి	10.5
గుండ్లపల్లి	8.0
చింతపల్లి	5.5
మర్రిగూడ	5.5

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో గురువారం సాయంత్రం ఈదురుగాలుల వాన కురిసింది. అడ్డగూడూరు మండలంలో అత్యధికంగా 40.9డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, సాయంత్రం వేళ ఆలేరు మండలంలో 2.5సెంటీమీటర్ల వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి ఎండవేడిమితో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రం వాతావరణం చల్లబడంతో కొంత ఉపశమనం పొందారు. మోత్కూరు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ధాన్యం రాశులు తడిసిపోవడంతో, రాశుల కింద నీటిని తొలగించేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలోనూ పలు మండలాల్లో ఈదురుగాలులతో చిరుజల్లులు కురిశాయి. నాగారం మండలంలో అకాల వర్షానికి ఐకేపీ కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. గురువారం సాయంత్రం మండలంలో అకస్మాత్తుగా గాలిదుమారం ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. అకాల వర్షానికి పొలాల్లో వరి నేలకొరిగింది. మామిడి తోటల్లో చెట్ల కొమ్మలు విరిగి మామిడికాయలు నేలరాలాయి. నల్లగొండ జిల్లాలోనూ పలు మండలాల్లో ఈదురుగాలుల వాన కురిసింది.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

7



రిజిస్ట్రేషన్ల శాఖలో

తీన్‌మార్

- వసూళ్ల కోసం ముగ్గురు ఉద్యోగుల సిండికేట్
- సొసైటీల విషయంలో ఇష్టారాజ్యం
- కోర్టుల్లో కేసులున్నా కదులుతున్న ఫైళ్లు
- అభ్యంతరాలను పట్టించుకోని ఉద్యోగులు. అధికారులు
- చేతులు మారుతున్న లక్షల రూపాయలు

నల్లగొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయంలో కొందరు ఉద్యోగుల ఇష్టారాజ్యంగా మారింది. కొన్ని రోజుల వరకు ఇన్‌చార్జి అధికారి ఉండగా, ఇటీవలే పూర్తి స్థాయి అధికారి సెలవుల నుంచి తిరిగి వచ్చారు. ఇన్‌చార్జి అధికారి ఉన్న సమయంలో కార్యాలయం అదుపుతప్పిందనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం కార్యాలయంలో ముగ్గురు ఉద్యోగులు సిండికేట్‌గా మారి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉండే కార్యాలయంలో వీరి చేయి తడవనిదే ఏ ఒక్క ఫైల్ కదలదని పలువురు బాధితులు పేర్కొంటున్నారు. ఆస్తుల

మిగతా 7వ పేజీలో...

హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్

ఉండాల్సిందే



- లేదంటే రవాణాశాఖ చర్యలు
- ఉమ్మడి జిల్లాలో 9లక్షలకు పైగా వాహనాలు
- సెప్టెంబరు 30 వరకు గడువు
- పంపిణీ సాధ్యమేనా?

రహదారులపై తిరిగే ప్రతీ వాహనానికి హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని రవాణాశాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. గతంలో వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించగానే తెలుపు రంగులో ఉండే ప్లేట్‌పై నలుపు రంగు అక్షరాలతో కూడిన నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకునేవారు. ట్యాక్సీ వాహనం అయితే పసుపు రంగు ప్లేట్ అమర్చాలి. ప్లేట్‌పై నంబర్లు ఇష్టం వచ్చినట్టుకాకుండా ఒక క్రమ పద్ధతిలో ఉండాలి. అయితే కొంత మంది వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకునేవారు. దీంతో 2013లో రవాణాశాఖ నూతన నెంబర్ ప్లేట్ల విధానాన్ని తీసుకొచ్చింది. హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లను అమలులోకి తెచ్చింది. వీటిని తప్పనిసరి చేస్తూ తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

● ఆంధ్రజ్యోతి, సూర్యాపేటక్రైం

ప్రస్తుతం వాహనదారులు వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలోనే హైసెక్యూరిటీ ప్లేట్‌కు సంబంధించిన చార్జీని వసూలు చేస్తున్నారు. నెంబర్ కేటాయించిన తర్వాత సంబంధిత ఏజెన్సీ ద్వారా హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్‌ను సంబంధిత వాహనానికి అమర్చుతున్నారు. అయితే కొంత మంది వాహనదారులు హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవడంలేదు. వారు సొంతంగా నెంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాలతోనే హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు అమలులోకి వచ్చాయి. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల అమలు విషయంలో రవాణాశాఖ ఉదాసీనంగా ఉండడం, పాత వాహనాలకు హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు లేకపోవడాన్ని తీవ్రంగా పరిగణించి ఇటీవల కేంద్రానికి కీలక సూచనలు చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో చేసేది లేక రవాణాశాఖాధికారులు హైసెక్యూరిటీ ప్లేట్ ఏర్పాటు చేసుకోని వాహనాలపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది.

● ఫీజులు ఇలా..

వాహనం	ఫీజు
బైక్	రూ.320-రూ.380
దిగుమతి చేసుకున్న బైక్	రూ.400-రూ.500
నాలుగు చక్రాల వాహనం	రూ.590-రూ.700
దిగుమతి చేసుకున్న నాలుగు చక్రాల వాహనం	రూ.700-రూ.860
మూడు చక్రాల వాహనం	రూ.350-రూ.450
వాణిజ్య వాహనం	రూ.600-రూ.800



గడువులోగా అమర్చుకోకపోతే

సౌకర్యాల నిలిపివేత

డీటీసీ శ్రీవాణి 7

ఫటాఫట్

● 9లక్షలకు పైగా వాహనాలు

ఉమ్మడి జిల్లాలో అన్ని రకాల వాహనాలు 9,59,445 వరకు ఉన్నాయి. అందులో సూర్యాపేట జిల్లాలో 2,02,181, నల్లగొండ జిల్లాలో 5,14,675, యాదాద్రి జిల్లాలో 2,42,589 వాహనాల వరకు ఉన్నాయి. అయితే వీటిలో సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయని వాహనాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, నల్లగొండ, మిర్యాలగూడ, భువనగిరి రవాణాశాఖ కార్యాలయాల పరిధిలో ఆయా వాహనాలకు సంబంధించిన నెంబర్ ప్లేట్లు అమర్చేందుకు ఏజెన్సీలు ఉన్నాయి. హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లతో వాహనం పూర్తి వివరాలు రవాణాశాఖ వెబ్‌సైట్‌లో ఉంటాయి. అంతేగాక సంబంధిత నెంబర్ ప్లేట్‌ను మార్పు చేసే అవకాశాలు తక్కువగా ఉంటాయి. దీంతో వాహనాలు చోరీకి గురైనప్పుడు ఛేదనలో ఈ సమాచారం ఉపయోగపడుతుంది.

2013 నుంచి హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్

రవాణాశాఖ 2013 నుంచే హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లను అమలులోకి తెచ్చింది. వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించే సమయంలోనే హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్ ఫీజును కూడా రవాణాశాఖ వసూలు చేస్తోంది. బైక్‌లకు నెంబర్

మిగతా 7వ పేజీలో...

డిగ్రీ పరీక్షలు వాయిదా

బకాయిల కోసం పట్టువీడని యాజమాన్యాలు, లెక్చరర్లు



ఈ నెల 11వ తేదీ నుంచి మే 6 వరకు జరగాల్సిన డిగ్రీ పరీక్షలు వాయిదా పడ్డాయి. దీంతో మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని సుమారు 86 ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సుమారు 25 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయలేని పరిస్థితి. తమకు రావల్సిన సుమారు రూ.100 కోట్ల ఫైబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తేనే పరీక్షల నిర్వహణకు సహకరిస్తామని కళాశాలలు భీష్మించుకు కూర్చున్నాయి. 6 (ఆంధ్రజ్యోతి- భువనగిరిటౌన్)

నేడు కలెక్టరేట్‌లో ప్రత్యేక 'ప్రజావాణి'

నల్లగొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం శుక్రవారం ప్రత్యేక 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక 'ప్రజావాణి'కి వచ్చిన దరఖాస్తులు తిరిగి రాకుండా సమస్యను పరిష్కరించేలా తహసీల్దార్లకు ఆర్డీవోలు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు.

నెల రోజులు పోలీస్ యాక్ట్ : ఎస్పీ

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు 30, 31 (ఎ) పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించవద్దన్నారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● శ్రీరాముడికి డోలారోహణం



శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని రామాలయంలో సీతారాముడికి అర్చకులు శాస్త్రోక్తంగా డోలారోహణం నిర్వహించారు.

మద్దతు ధర చెల్లించకుంటే చర్యలు

- అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- మిల్లర్లను హెచ్చరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యానికి మద్దతు ధర చెల్లించకుంటే చర్యలు తప్పవని మిల్లర్లను అధికారులు, ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. రెండు రోజులుగా ధాన్యాన్ని మిల్లర్లు తక్కువ కొనుగోలు చేస్తున్నారని, మద్దతు ధర చెల్లించడం లేదని 'ఆంధ్రజ్యోతి' మెయిన్, మినీలో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, శెట్టిపాలెం ప్రాంతంలో రెండు మిల్లులు ధర విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, తీరు మారకుంటే మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాట్లాడుతూ, తాను బుధవారం మధ్యాహ్నం 3.30గంటల ప్రాంతంలో శెట్టిపాలెం మిల్లుల వద్దకు వెళ్లగా ఒక్క ధాన్యం ట్రాక్టర్ కనిపించలేదని, తిరిగి 4 గంటలకు 45 ట్రాక్టర్లు రోడ్డువెంట బారులు తీరి కన్పించాయన్నారు. రైతులను అడగ్గా, మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయడంలేదని చెప్పారని పేర్కొన్నారు. లీగల్ మెట్రాలజీ అధికారులతో కాంటాలను తనిఖీ చేయించగా, ఓ మిల్లు వద్ద 10 టన్నులకు 40 కిలోల తూకం తక్కువగా వచ్చిందని తేలిందన్నారు. మిల్లర్లు గత సమావేశంలో చెప్పిన కారణాలే తిరిగి చెప్పకుండా మిల్లర్స్ అసోసియేషన్ ఏం చర్యలు తీసుకుందో చెప్పాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. గతంలో ఓ రకం ధాన్యం కొనుగోలు చేయలేదని, ధర తగ్గిస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. సమావేశంలో పౌరసరఫరాలశాఖ డీఎం హరీష్, తహసీల్దార్ హరిబాబు, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, నాయకులు మహనంద చౌదరి, బండారు కుశలయ్య, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, తదితరులు

నల్లగొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ పార్టీ రజోత్సవసభను విజయవంతం చేయాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో బహిరంగ సభ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఆదాయం లేకుండా పోయిందని, మరో మూడేళ్ల పాటు ఈ ప్రభుత్వాన్ని ఏ విధంగా భరించాలో అర్థంకాక ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రుల వల్ల రైతులు నష్టపోయారన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి పతిపక్ష పార్టీల నాయకుల ఫోన్లు ఎత్తడం లేదని ఆరోపించారు. మంత్రి చెప్పిన విధంగానే కలెక్టర్ వ్యవహరిస్తున్నారన్నారు. ఆమె స్వయంగా ప్రజల సమస్యలపై సమీక్ష చేయడం లేదన్నారు. ఈ నెల 13వ తేదీన నల్లగొండలో జరిగే నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవసభపై చర్చించనున్నట్లు తెలిపారు. వరంగల్ సభకు అన్ని గ్రామాలు, పట్టణాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. 2001లో కేసీఆర్ ఒక్కరిగా బయటకు వచ్చి తెలంగాణ రాష్ట్రం కోసం లక్షల సైన్యాన్ని కదిలించారన్నారు. సమావేశంలో నాయకులు కటికం సత్తయ్యగౌడ్, నిరంజన్ వలీ, రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, బొర్ర సుధాకర్, మందడి సైదిరెడ్డి, జి.వెంకటేశ్వర్లు, కరీంపాషా, తండు సైదులు, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, తుమ్మల లింగస్వామి, వంగాల సహదేవారెడ్డి, కంచనపల్లి రవీందర్ రావు, కొండూరు సత్యనారాయణ, యాట జయప్రద రెడ్డి, జమాల్‌ఖాద్రీ పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



అర్జాలబావి ఐకేపీ కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండటౌన్, నల్లగొండ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అమలుకాని హామీలు ఇచ్చి రైతులను మోసం చేసిందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అర్జాలబావి ఐకేపీ కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. జిల్లాలో 354 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కేవలం 50 కేంద్రాలు ప్రారంభించి అధికారులు చేతులు దులుపుకున్నారన్నారు. సన్న ధాన్యంతోపాటు దొడ్డు రకాలకు సైతం రూ.500 బోనస్ ఇవ్వాలని, గత ఏడాది ఇవ్వాల్సిన బోనస్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై చిన్నచూపు చూస్తోందని, కొనుగోలు కేంద్రాల్లో సరైన వసతులు కల్పించడంలేదని విమర్శించారు. రానున్న రోజుల్లో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు పాపయ్యగౌడ్, పడమటి జగన్మోహన్‌రెడ్డి, బీపంగి జగ్జీవన్, పాలకూరి రవి, పోతెపాక లింగస్వామి, యాదగిరిచారి, మిర్యాల వెంకన్న, గడ్డం వెంకట్‌రెడ్డి, భిక్షంరెడ్డి, అశోక్‌రెడ్డి, పక్కీరు మోహన్‌రెడ్డి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తార, తదితరులు పాల్గొన్నారు.

అధిక తూకంపై ప్రభుత్వం స్పందించాలి

(ఆంధ్రజ్యోతి, తిప్పర్తి, మాడ్గులపల్లి): ధాన్యం కొనుగోలు సమయంలో అధిక తూకం వేయడంపై ప్రభుత్వం స్పందించాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం తిప్పర్తి మార్కెట్ యార్డు, మాడ్గులపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులను మార్కెట్ నిర్వాహకులు, మిల్లర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులతోపాటు నిరంజన్‌రెడ్డి, వంగూరి రవి, ఇటికాల జాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో కార్డన్ సెర్చ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌కాలనీలో గురువారం తెల్లవారుజామున పోలీసు బృందాలు కార్డన్‌సెర్చ్ నిర్వహించాయి. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు వివరాలు వెల్లడించారు. ఎస్పీ ఆదేశాల మేరకు చేపట్టిన కార్డన్‌సెర్చ్‌లో కొందరు అనుమానితులను గుర్తించామన్నారు. 56 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలను సీజ్‌చేసినట్లు తెలిపారు. వీటిలో నెంబర్ ప్లేట్లులేని 12 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలకు సంబంధించి సరైన ధ్రువీకరణపత్రాలు లేవని తెలిపారు. కార్డన్‌సెర్చ్‌లో పట్టుబడ్డ వాహనాల నెంబర్లు ట్యాంపరింగ్ చేసినట్లు గుర్తించామన్నారు. ఈ వాహనాలు ఎక్కడి నుంచి వచ్చాయి, ఏదైనా నేరాలకు పాల్పడ్డారన్న అంశాలపై లోతైన విచారణ కొనసాగిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలో కార్డన్‌సెర్చ్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అనుమానితులు తిరుగుతున్నట్లు అన్పిస్తే సమాచారమివ్వాలని కోరారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. రహదారులపై అతివేగంగా వాహనాలపై తిరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్డన్ సెర్చ్‌లో సీఐలు పీఎన్‌డీ ప్రసాద్, సోమనర్సయ్య, మోతీరాం, 12మంది ఎస్ఐలు, 75మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అదుపుతప్పి గోతిలో పడిన కారు



కారును బయటికి తీస్తున్న క్రేన్

మేళ్లచెర్వు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు నుంచి కోదాడ వైపు వెళ్తున్న కారు గురువారం తెల్లవారుజామున అదుపు తప్పి కందిబండ వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం తీసిన గోతిలో పడింది. ప్రమాద సమయంలో కారులో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఏటీఎంలో రూ.12.91లక్షలు అపహరణ

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం శివారు హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి పక్కన మల్లికార్జున్ రైస్‌మిల్లు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం ధ్వంసం చేసి రూ.12,91,400ల నగదును దుండగులు అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. మంగళవారం తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో దొంగలు ఏటీఎంలోకి ప్రవేశించి గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను ధ్వంసం చేసి నగదును అపహరించి కారులో పరారైనట్లు పోలీసులు తెలుసుకున్నారు. సీసీ కెమెరాల ద్వారా దుండగుల ఆచూకీ తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాల ద్వారా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. డీసీపీ అక్షాంశ్‌యాదవ్ ఆధ్వర్యంలో భువనగిరి, చౌటుప్పల్, ఎల్‌బీనగర్, మల్కాజిగిరి, ఎస్‌వోటీ క్రైం, టాస్క్‌ఫోర్స్ స్థానిక పోలీసులు దుండగుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. బుధవారం రాత్రి 7గంటల నుంచి గురువారం రాత్రి వరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అంతరాష్ట్ర దొంగల ముఠా చోరీకి పాల్పడినట్లు అంచనాకు వచ్చారు.

కల్లు నమూనాల సేకరణ



కల్లు నమూనాలు సేకరిస్తున్న అధికారులు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా బాన్సువాడలో వెలుగు చూసిన కల్తీకల్లు విక్రయాల నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎక్సైజ్ శాఖ అప్రమత్తమైంది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ సర్కిల్స్‌లో రెండు రోజులపాటు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా కల్లు నమూనాలు సేకరించి కోర్టు ద్వారా ల్యాబ్‌కు పంపారు. సుమారు పది రోజుల్లో ల్యాబ్ నివేదిక రానున్నట్టు తెలిసి ంది. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు. భువనగిరి, రాజాపేటలో మాత్రమే అనుమతులు పొందిన కల్లు డిపోలు ఉండగా, మిగతా ప్రాంతాల్లో స్థానిక గీత కార్మికులే కల్లు విక్రయిస్తుంటారు. రియల్ ఎస్టేట్ కారణంగా పెద్ద సంఖ్యలో తాటి, ఈత చెట్లను తొలగించడం, కల్లుగీత కార్మికులు తగ్గుతుండటంతో డిమాండ్‌కు సరిపడ కల్లు లభించడం లేదు. యూ రియా, డైజోఫామ్, క్లోరో హైడ్రేడ్ రసాయనాలతో కృత్రిమ కల్లు త యారు చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. భువనగిరితో పాటు జిల్లాలోని ప్రధాన రహదారుల వెంట ఈ తరహా కృత్రిమ కల్లు విక్రయాలు చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. కల్లు నమూనాల సేకరణ నిరంతర ప్రక్రియ అని, ప్రతి నెలా సేకరిస్తామని ఎక్సైజ్ అధికారులు పేర్కొనడం గమనార్హం.

కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఆరు నెలల జైలు

కట్టంగూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఆరు నెలలు జైలుశిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ నల్లగొండ జిల్లా కోర్టు జిల్లా అదనపు న్యాయమూర్తి రోజా రమణి గురువారం తీర్పు ఇచ్చారు. కేసుకు సంబంధించి కట్టంగూరు ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... 2018 సెప్టెంబరు 17వ తేదీన మండలంలోని గార్లబాయిగూడేనికి చెందిన పాల్వాయి రాంరెడ్డి అదే గ్రామానికి చెందిన బేడ బుడిగజంగం కులానికి చెందిన ఓ వ్యక్తి భూమిలోకి అక్రమంగా వెళ్లాడు. అడ్డుకోబోయిన సదరు వ్యక్తిని కులం పేరుతో దూషించడంతో బాధితుడు అప్పట్లో స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. అప్పటి ఏఎస్ఐ వెంకన్న కేసు నమోదు చేశారు. అప్పటి నల్లగొండ డీఎస్పీ సుధాకర్ దర్యాప్తు చేశారు. డీఎస్పీ గంగరాం కోర్టులో తుది నివేదిక అందజేశారు. ఈ కేసులో నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టులో వాదనలు జరిగిన అనంతరం నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ జిల్లా అదనపు న్యాయమూర్తి తీర్పువెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యాయం చేయాలని ఆందోళన

మోటకొండూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని కొండాపురంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొట్టడంతో గుడ్డేటి నర్సమ్మ(60) మృతిచెందింది. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలటూ బంధువులు, గ్రామస్థులు రాయగిరి-మోత్కూరు ప్రధాన రహదారిపై గురువారం సుమారు మూడు గంటలపాటు ఆందోళన చేశారు. దీంతో మేర ట్రాఫిక్ జామ్ అయింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ధర్నా విరమించాలని చెప్పినా వారు ససేమిరా అన్నారు. కొద్దిసేపటి తర్వాత ఏసీపీ రమేష్‌కుమార్, ఎస్ఐ నాగుల ఉపేందర్‌యాదవ్ ఆందోళనకారుల వద్దకు చేరుకొని నర్సమ్మ కుటుంబసభ్యులు, స్థానికులతో మాట్లాడారు. మృతురాలి కుటుంబసభ్యులకు న్యాయం చేసే విధంగా కృషిచేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



రాస్తారోకో చేస్తున్న మృతురాలి బంధువులు

బౌన్సర్.. చెమటోడ్చాల్సిందే

బౌన్సర్.. ప్రస్తుత సమాజంలో హోదాకు ఓ కొలమానం. జనసమూహంతో కూడిన ఏ కార్యక్రమమైనా వారుండాల్సిందే. ధృడమైన శరీరాకృతితో ఉండే వారిని చూస్తే ఎవరికైనా వారు చెప్పినట్లు నడుచుకోవాలన్నట్లు ఉంటారు. వారిని ముందుంచి ఇప్పుడు ప్రజాప్రతినిధులు, సెలబ్రిటీలు, పలుకుబడి కలిగిన వారి ఇళ్లలో పెళ్లిళ్లు, వారి ఆధ్వర్యంలో ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నారు. బౌన్సర్ల సంస్కృతి ఇప్పుడు మహానగరాల నుంచి జిల్లాలకు విస్తరించింది. ఉమ్మడి జిల్లాలో 150మంది వరకు గుర్తింపు పొందిన బౌన్సర్లు ఉన్నారు.

-ఆంధ్రజ్యోతి- సూర్యాపేట(కలెక్టరేట్)

● శుభకార్యాలు, సమావేశాలు, ప్రారంభోత్సవాలు, హోటళ్లు వద్ద విధులు

● శరీరాకృతి కోసం నెలకు రూ.15వేల ఖర్చు

ఇటీవల ఏదైనా కార్యక్రమం జరిగితే అక్కడ బౌన్సర్లు కనబడుతున్నారు. సమాజంలో కొంచెం పలుకుబడి, డబ్బున్న వారు వారి నివాసాల్లో, కంపెనీల్లో జరిగే కార్యక్రమాలకు బౌన్సర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. హైదరాబాద్, వరంగల్ లాంటి ప్రధాన నగరాలకు మాత్రమే పరిమితం కాగా ఇటీవల గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలకు కూడా విస్తరించింది. కొంతమంది యువత ఆరోగ్యం కోసం ప్రారంభించిన వ్యాయామం చివరికి వారికి ఉపాధి అవకాశాలు చూపుతోంది. ప్రతి రోజూ జిమ్‌లకు వెళ్లి గంటల తరబడి వివిధ రకాల సాధనలుచేసి వారి శరీరాన్ని అందంగా తీర్చిదిద్దుకుంటున్నారు.



కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్న బౌన్సర్లు

వయస్సు పెరిగితే అంతే..

బౌన్సర్లకు వయస్సు పెరిగితే ఉపాధి లభించే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. 35ఏళ్లు దాటితే బౌన్సర్లుగా ఉపాధి అవకాశాలు ఇవ్వడం లేదు. మహిళలకు సుమారు 20 ఏళ్ల నుంచి 30ఏళ్ల లోపు వారికే అవకాశాలు ఉంటాయి. పురుషుల విషయంలో కూడా బౌన్సర్లుగా పనిచేసిన రోజుల్లో మినహాయిస్తే వారికి ఆర్థిక ఇబ్బందులు కలుగుతున్నాయి. శరీరాకృతి కొనసాగించాలంటే ప్రతి రోజూ జిమ్‌లకు వెళ్లి వ్యాయామం చేయడంతో పాటు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి.

ఏడాదిలో 150 రోజులు మాత్రమే ఉపాధి

బౌన్సర్లకు ఏడాదిలో సుమారు 150రోజులు మాత్రమే ఉపాధి లభిస్తుంది. ఉపాధి లభించిన రోజు ఒక్కో బౌన్సర్‌కు రూ.2వేల నుంచి రూ.2500 వరకు వేతనం చెల్లిస్తున్నారు. మిగిలిన రోజుల్లో ఖాళీగా ఉంటున్నారు. ఎక్కడైనా ఏదైనా కంపెనీలో గానీ ఇతర కార్యాలయాల్లో పని చేద్దామంటే బౌన్సర్లను పనులకు పెట్టుకునేందుకు ఆసక్తి చూపడంలేదు. దీంతో బౌన్సర్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 150 మంది బౌన్సర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 150మంది బౌన్సర్లు ఉన్నారు. 18ఏళ్లు పైబడిన వారి నుంచి 50ఏళ్ల వయస్సు గల వారు బౌన్సర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడ, కోదాడ, భువనగిరి, ఖమ్మం, వరంగల్, దేవరకొండ పట్టణాలతో పాటు ఇతర ప్రాంతాల్లో బౌన్సర్లు పని చేస్తున్నారు. అవసరమైతే హైదరాబాద్‌లో కూడా పనిచేయడానికి వెళ్తున్నారు. బౌన్సర్ల కోసం ప్రభుత్వ అనుమతితో కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. అనుమతి పొందిన ఏజెన్సీలు బౌన్సర్లను ఎంపిక చేసుకుని వారికి గుర్తింపుకార్డులు జారీ చేస్తున్నారు. ఏ కార్యక్రమంలోనైనా ఘర్షణ జరిగినప్పుడు ఆ ప్రభావం బౌన్సర్లపై పడుతుంది. హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట బౌన్సర్ల విధులపై చర్చనీయాంశమైంది. ఘర్షణలు జరిగినప్పుడు బౌన్సర్లపై అనేక దాడులు జరుగుతుంటాయి. వాటిని తట్టుకోవాల్సిన పరిస్థితి బౌన్సర్లపై ఉంది.



ఎక్కడైనా విధులు..

బౌన్సర్లు ఎక్కడైనా, ఎప్పుడైనా విధులు నిర్వహిస్తుంటారు. శుభకార్యం, రాజకీయ, ఇతర సమావేశాలు, షాపింగ్ మాల్స్ కంపెనీల ప్రారంభోత్సవాలు, హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్ల వద్ద బౌన్సర్లు విధులు నిర్వహిస్తున్నారు. శుభకార్యాల్లో వేదికపైకి ఇష్టానుసారంగా అతిథులు వెళ్లకుండా వరుస క్రమంలో పంపిస్తూ సమయాన్ని వృథా కాకుండా కార్యక్రమం నిర్వహించుకునే వారిని అందరూ దీవించేలా విధులు నిర్వహిస్తుంటారు. అదే సమావేశాల విషయంలో వేదికపైకి అనుమతిలేని వారు వెళ్లకుండా, తోపులాట జరగకుండా నిరోధిస్తుంటారు. షాపింగ్ మాల్స్, వివిధ రకాల కంపెనీల ప్రారంభోత్సవాలకు సెలబ్రిటీలు, వీఐపీలు, రాజకీయ ప్రముఖులు హాజరవుతుంటారు. అలాంటి సందర్భాల్లో ఎలాంటి తోపులాట జరగకుండా కార్యక్రమం సాఫీగా జరిగేలా పనిచేస్తుంటారు. పెద్దపెద్ద స్టార్ హోటళ్లు, ఆస్పత్రులు, బార్ అండ్ రెస్టారెం ట్ల వద్ద కొంతమంది ఘర్షణ పడుతుంటారు. బౌన్సర్లను నియమించుకొని వారి ద్వారా ఘర్షణ పడేవారిని అడ్డుకుంటారు.

ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలి



బౌన్సర్లకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు చూపించాలి. ఏడాదిలో 150 రోజులు మాత్రమే ఉపాధి లభిస్తుంది. మిగిలిన రోజుల్లో ఖాళీగా ఉంటున్నాం. ఏదైనా కంపెనీలు, కార్యాలయాల్లో బౌన్సర్లను పనులకు పెట్టుకోవడం లేదు. ప్రభుత్వం వివిధ కంపెనీల వద్ద ఏర్పాటు చేసే సెక్యూరిటీ ఉద్యోగాల్లో బౌన్సర్లకు అవకాశాలు కల్పించాలి. శరీరాకృతి కోసం నెలకు కనీసం రూ.15వేలు ఖర్చవుతోంది.

- భగవాన్, భగత్ సెక్యూరిటీ సర్వీసెస్, నల్లగొండ.



ట్రాక్టర్ ట్రాలీ మృత్యు శకటమై..

● రోడ్డుపై ఉన్న ట్రాలీని ఢీకొన్న బైక్.. ఒకరు మృతి ● రెండు గంటల వ్యవధిలో అదే ట్రాలీని ఢీకొన్న మరో బైక్.. మరో యువకుడు మృత్యువాత



ప్రమాదాలకు కారణమైన ట్రాక్టర్ ట్రాలీ

కనగల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మరొకరు మృత్యువుతో పోరాడుతున్నారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని బాబాసాయిగూడెం స్టేజీ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు సింగం కొండల్ బుధవారం సాయంత్రం తన ట్రాక్టర్ ట్రాలీలో ధాన్యం నింపుకుని నల్లగొండలోని ఓ మిల్లులో విక్రయించేందుకు గ్రామం నుంచి బయల్దేరాడు. బాబాసాయిగూడెం స్టేజీ వద్దకు చేరుకోగానే ట్రాక్టర్ ట్రాలీ టైర్ పంక్చర్ అయింది. దీంతో ట్రాలీని రోడ్డు పక్క ఉంచి ట్రాక్టర్ ఇంజన్‌ను తీసుకుని వెళ్లిపోయాడు. ఈ క్రమంలో రాత్రి 8:30 గంటల సమయంలో హాలియా మండలం శ్రీనాధపురం గ్రామానికి చెందిన చింతకాయల కిరణ్‌కుమార్(32) కనగల్ మండలంలోని తుర్కపల్లి గ్రామంలో నడుస్తున్న వరికోత మిషన్‌వద్దకు బైక్ తీసుకుని అదేగ్రామానికి చెందిన జినుకుల అఖిల్‌తో కలిసి వస్తున్నాడు. మార్గమధ్యలో బాబాసాయిగూడెం స్టేజీ వద్ద రోడ్డుపై నిలిపి ఉంచిన ట్రాలీని వెనుకనుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కిరణ్‌కుమార్, అఖిల్‌కు తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళ్తున్న కొందరు వాహనదారులు గమనించి క్షతగాత్రులను 108వాహనంలో చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరుకొనేలోపే కిరణ్‌కుమార్ మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన అఖిల్‌కు చికిత్సను అందిస్తున్నారు.

అదే ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని..

మరో రెండు గంటల తర్వాత రాత్రి 11 గంటల సమయంలో గుర్రంపోడు మండలం కొప్పోల్ గ్రామానికి చెందిన బల్గూరి శేఖర్‌గౌడ్(35) మిర్యాలగూడలో ఓ దుస్తులు దుకాణం నిర్వహిస్తున్నాడు. షాపు మూసి వేసిన అనంతం బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా కనగల్ మండలం బాబాసాయిగూడెం స్టేజీ వద్దకు చేరుకోగానే రోడ్డుపై ఉన్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్నాడు. శేఖర్‌గౌడ్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. రెండు గంటల వ్యవధిలో రెండు ప్రమాదాలు జరిగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాలు జరిగాయని మృతుల బంధువులు ఆరోపించారు. మృతదేహాలకు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కిరణ్‌కుమార్ సోదరుడు సంతోష్, శేఖర్‌గౌడ్ భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని..

చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాలలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. నార్కట్‌పల్లి గ్రామానికి చెందిన భాశెట్టి శ్రీనివాస్(57) చిట్యాలలోని ఓ రైస్‌మిల్లులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. గురువారం బైక్‌పై మిల్లుకు వెళ్తుండగా భువనగిరి నుంచి చిట్యాల వైపు ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఖమ్మం జిల్లాలో రోడ్డు ప్రమాదం.. సూర్యాపేట జిల్లావాసి మృతి

దమ్మపేట: సూర్యాపేట జిల్లా కాసరబండ గ్రామానికి చెందిన మచ్చ ఎల్లయ్య(37) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సూర్యాపేటకు చెందిన కొందరితో కలిసి కూలి పనుల నిమిత్తం దమ్మపేట మండలం గట్టుగూడెంలో వేరుశనగ కోత పనుల కోసం వచ్చాడు. పనినిమిత్తం తోటలోకి వెళుతూ రోడ్డు దాటుతుండగా అశ్వారావుపేట వైపునకు వెళ్తున్న లారీ వేగంగా వెళుతూ అదుపు తప్పి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సత్తుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరిశీలించిన డాక్టర్లు ఎల్లయ్య మృతిచెందినట్లు ధ్రువీకరించారు.

రైస్‌మిల్లు వేబ్రిడ్జి తూకంలో తేడా



వేబ్రిడ్జిని తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ

వేములపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లులకు అనుసంధానంగా పనిచేస్తున్న బారుకాంటా (వేబ్రిడ్జి)లో తూకంలో జరుగుతున్న మోసాన్ని తూనికలు, కొలతల అధికారులు తనిఖీల్లో బహిర్గతం చేశారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలో గురువారం జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శెట్టిపాలెం గ్రామ పరిధిలోని మహాతేజ రైస్‌మిల్లుకు సంబంధించిన వేబ్రిడ్జిని అధికారులు తనిఖీ చేయగా, పది టన్నుల ధాన్యం తూకంలో 40కేజీల తేడాను అధికారులు గుర్తించారు. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మహాతేజ రైస్‌మిల్లు కీలకంగా వ్యవహరించింది. ఈ రైస్‌మిల్లుకు అనుసంధానంగా మరో రైస్‌మిల్లును నడిపిస్తుండగా నిత్యం సుమారు 600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరుగుతోంది. ధాన్యం విక్రయాల్లో ఏర్పడ్డ అసౌకర్యం, రైతుల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకునేందుకు మిల్లు యాజమాన్యం మద్దతు ధర చెల్లించకుండా విక్రయాలు కొనసాగిస్తూనే మరోవైపు ధాన్యం తూకంలో మోసం చూస్తూ రైతుల ఆరుగాల కష్టాన్ని అందినంతగా దోచుకుంటున్న తీరు తూనికలు, కొలతల అధికారుల తనిఖీలతో బయటపడడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. తూకంలో మోసాలకు పాల్పడుతున్న రైస్‌మిల్లుపై కేసు నమోదు చేసి రూ. 1.25లక్షల జరిమానా విధించినట్లు జిల్లా లీగల్‌మెట్రాలజీ అధికారి రామకృష్ణ తెలిపారు. రైలు మిల్లు తూకాల్లో జరుగుతున్న మోసాలపై అనుమానం కలిగినా ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందించి తనిఖీలు జరిపి కేసులు నమోదు చేస్తామన్నారు.

మదర్ డెయిరీ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రతిపక్షాల కుట్ర

హయత్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని, అందులో భాగంగానే చైర్మన్ మధుసూదన్‌రెడ్డిపై అవిశ్వాసం పెడుతున్నట్లు వార్తలు వెలువడ్డాయని మదర్ డెయిరీ డైరెక్టర్లు అన్నారు. హయత్‌నగర్‌లోని మదర్‌డెయిరీ కార్యాలయంలో చైర్మన్‌తో కలిసి గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డెయిరీని ఇబ్బందులకు గురిచేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ చెందిన డైరెక్టర్లంతా ఒకే తాటిపై ఉన్నామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలవనున్నట్లు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు మందడి ప్రభాకర్‌రెడ్డి, గొల్లెపల్లి రాంరెడ్డి, కళ్లెపల్లి శ్రీశైలం, కర్నాటి జయశ్రీ ఉప్పల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఎం. జంగయ్య, శ్రీధర్‌రెడ్డి, నర్సింహులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

● బకాయిల కోసం పట్టువీడని యాజమాన్యాలు, లెక్చరర్లు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు బహిష్కరణ అస్త్రం ప్రయోగిస్తున్నాయి. బకాయి వేతనాలు చెల్లించాలని లెక్చరర్లు నిరసనలకు దిగుతున్నారు. ఫలితంగా నేటినుంచి ప్రారంభం కావల్సిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) వాయిదా వేసింది. దీంతో విద్యా సంవత్సరం ముగింపులో విద్యార్థుల మానసిక ఒత్తిడికి గురయ్యే పరిస్థితి నెలకొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు ఆర్థిక ఊబిలోకి కూరుకుపోతున్నాయి. వివిధ రూపాల్లో నిరసన తెలిపినా ప్రభుత్వం స్పందించకపోవడంతో పరీక్షలనే బహిష్కరిస్తున్నట్లు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ ఇటీవల ప్రకటించింది. ఎంజీయూ పరిధిలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో నిర్వహించే ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలను బహిష్కరిస్తున్నట్లు గత నెలలోనే యూనివర్సిటీకి లేఖ కూడా అందజేసింది. ఆరు నెలలుగా వేతనాలు రావడం లేదని లెక్చరర్లు కూడా పరీక్షలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎంజీయూ పరిధిలో ఈ నెల 2 నుంచి 9 వరకు రెండు దఫాలుగా జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలను ప్రైవేట్ యాజమాన్యాలు, లెక్చరర్లు బహిష్కరించడంతో కేవలం ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య గురుకుల, ఎయిడెడ్ కళాశాలల్లో మాత్రమే ప్రాక్టికల్స్ పరీక్షలు జరిగాయి. దీంతో ప్రైవేట్ విద్యార్థులు నష్టపోయారు. బకాయిలపై ప్రభుత్వం స్పందించకపోవడం, ప్రైవేట్ యాజమాన్యాలు, లెక్చరర్స్ పట్టు వీడకపోవడంతో 11నుంచి ప్రారంభం కావల్సిన సప్లమెంటరీ, సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు ఎంజీయూ గురువారం సాయంత్రం ప్రకటించింది.

షెడ్యూల్ ప్రకారం..

షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 11 నుంచి మే 6 వరకు జరగాల్సిన 1, 3, 5వ సెమిస్టర్స్ సప్లిమెంటరీ, 2, 4, 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. దీంతో ఎంజీయూ పరిధిలోని సుమారు 86 ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సుమారు 25వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయలేని పరిస్థితి. తమకు రావల్సిన సుమారు రూ.100 కోట్ల పైబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తేనే పరీక్షల నిర్వహణకు సహకరిస్తామని సుమారు 66 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, ఆరు నెలల బకాయి వేతనాలు సుమారు రూ. 25 కోట్ల పైబడి చెల్లిస్తేనే పరీక్షల విధులు నిర్వహిస్తామని ప్రైవేట్ లెక్చరర్స్ పేర్కొంటుండటంతో ప్రభుత్వ నిర్ణయంపైనే పరీక్షల నిర్వహణ ఆధారపడి ఉందని యూనివర్సిటీ అధికారులు, కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. గత అక్టోబరులో చేపట్టిన సమ్మె విరమణ ఒప్పందంలో ఇచ్చిన హామీలేవి ప్రభుత్వం నెరవేర్చలేదని, దీంతో హామీలు కాకుండా వాస్తవాల ఆధారంగానే సమ్మె విరమణ, పరీక్షల నిర్వహణ ఆధారపడి ఉంటుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఉమ్మడి జిల్లా కోశాధికారి ప్రవీణ్‌కుమార్, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం అసోసియేట్ అధ్యక్షుడు కోడిమాల కృష్ణ తెలిపారు.

నైపుణ్యాలకు పెద్దపీట

● నిర్మాణాత్మక శిక్షణకు ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం దోహదం

మానవ మేధస్సును మించి ఆలోచన చేసే సాంకేతికత అందుబాటులోకి వస్తోంది. ప్రతీ విభాగంలోనూ కృత్రిమ మేధ చొచ్చుకు పోతోంది. ఈ నేపథ్యంలో నిర్మాణాత్మక మైన విద్య అవసరం. అందుకే భారత ప్రభుత్వం వినూత్న పథకాన్ని రూపొందించింది. విద్య, అభ్యాసం వాస్తవ ప్రపంచ అనుభవాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ప్రయోగాలు చేయదలిచింది. అందు లో భాగంగానే విద్య, ఉద్యోగార్థులకు ఆచరణాత్మకమైన ఇంటర్న్‌షిప్ అందించడంతో పాటు స్టైఫండ్ ఇవ్వనుంది.

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)



భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రూపొందించిన పథకమే పీఎం ఇంటర్న్‌షిప్. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఐటీఐ, ఏఐసీటీఈ గుర్తింపు పొందిన డిప్లొమా, డిగ్రీ, పీజీ విద్యనభ్యసించిన అభ్యర్థులు అర్హులు. 21 నుంచి 24 ఏళ్ల లోపు వయసు నుంచి నిర్దేశించిన విద్యార్హతలు కలిగిన విద్యార్థులు/అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సర్టిఫికెట్లు, గుర్తింపు పత్రాలను సంబంధిత అధికారులు పరిశీలించి తుది జాబితా ప్రకటిస్తారు. అయితే ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15 చివరి తేదీ.

యాప్ విడుదల

నిర్మాణాత్మకమైన ప్రయోగ విద్య, ఉపాధి కల్పనతో రూపొందించిన ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి సంబంధించి ప్రత్యేక యాప్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ విడుదల చేశారు. పథక ప్రత్యేకతలు, వివరాలు, దరఖాస్తు చేసుకునే వివరాలను సులభతరం చేస్తూ రూపొం దించింది 'పీఎంఐఎస్' మొబైల్ యాప్.

ఐదేళ్లలో కోటి మందికి..

2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా ఐదేళ్లలో కోటి మంది విద్యార్థులకు ఉద్యోగపరమైన శిక్షణనిస్తుందీ పథకం. పైలట్ ప్రాజెక్టుగా తొలుత లక్షా 25 వేల మందిని ఇంటర్న్‌షిప్‌నకు ఎంపిక చేస్తారు. దేశంలోని ప్రముఖ 549 సంస్థలలో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పిస్తుంది.

పేరొందిన సంస్థల సహకారంతో...

దేశంలోని 25 రంగాలకు సంబంధించిన సంస్థల సహకారంతో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం నడవనుంది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఫార్మాస్యూటికల్, అగ్రికల్చర్, ఎలక్ట్రానిక్స్ ట్రాన్స్‌పోర్ట్, సోలార్ సిస్టమ్ తదితర 25 విభాగాల్లో ప్రఖ్యాతి చెందిన బహుళజాతి సంస్థలు ఈ పథకం ద్వారా ఎంపికైన ఉద్యోగార్థులకు సంవత్సర కాలం వేతనంతో (కేంద్రప్రభుత్వం రూ. 4,500, సదరు సంస్థ రూ. 500 మొత్తం కలిపి రూ. 5వేలు) కూడిన శిక్షణ అందిస్తాయి.

ఉపయోగాలివే..

ఉపాధి, నైపుణ్యాభివృద్ధిని కల్పిస్తూ రూపొందించిన పథకమే పీఎం ఇంటర్న్‌షిప్. ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించడంతో పాటు విద్యార్హతలకు అనుగుణంగా స్టైఫండ్ అందిస్తారు.

తొలి దశలో 37వేల మంది పట్టభద్రులకు, 23వేల మంది ఐటీఐ సర్టిఫికెట్ హోల్డర్లు, ఏఐసీటీ ఈ గుర్తింపు పొంది, ఇంటర్ పూర్తి చేసిన 18 వేల మందికి, పదో తరగతి పూర్తి స్థాయిలో 25వేల మందికి ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించనున్నట్లు కేంద్ర వ్యవహారాల శాఖ పేర్కొంది.

అర్హులు, అర్హతలివే..

- పీఎంఐఎస్ పథకానికి దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 21 నుంచి 24 ఏళ్ల లోపు విద్యా ర్థులు దరఖాస్తు చేసుకోవాలి
- దరఖాస్తుదారుడి కుటుంబ సంవత్సర ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండాలి
- దరఖాస్తుదారుడు ప్రభుత్వ ఉద్యోగస్తుడి కుటుంబ సభ్యుడై ఉండరాదు.
- పథకంలో పేర్కొన్న విద్యార్హతలు పూర్తి చేసి ఉండాలి.(అంటే ప్రస్తుతం ఆయా కోర్సులు చదువుతున్న వాళ్లు కాదు.. సదరు విద్యార్హతలను పూర్తి చేసి ఉండాలి)

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పీఎంఐఎస్ పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ పోర్టల్‌తో పాటు ప్రత్యేక యాప్(పీఎంఐఎస్) కూడా అందుబాటులో ఉంది. ప్రముఖ సంస్థలలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయి.

- డాక్టర్ ఉపేందర్ , ప్రిన్సిపాల్, ఎన్జీ ప్రభుత్వ కళాశాల, నల్లగొండ.

సమాచారం తెలుసుకుంటూ ఉండాలి



ఏది సాధించాలన్నా సమాచార సేకరణ ముఖ్యం. తద్వారావిద్య, ఉద్యోగ రంగాల్లో వస్తున్న భారీ మార్పులు, అప్‌డేట్స్ తెలుస్తుంటాయి. నైపుణ్యం కలిగిన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో అవకాశాలు అందిస్తున్నాయి. విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా విషయాలు తెలుసుకుంటుండాలి.

- రాచమళ్ల శ్రీను, లైబ్రరీ అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాల, రామన్నపేట.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ప్రాకార మండపంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్ర వైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.19,47,072 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుని క్షేత్రంలో గురువారం శ్రీరాజలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహుని నిత్యకల్యాణం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. ఉదయం హోమాధికాలు భక్తిశ్రద్ధలతో చేశారు. తదుపరి కల్యాణ మూర్తులను పరిణయోత్సవ వేదికపైకి వేంచేయించి పుణ్యాహవాచనం గావించారు. మాంగళ్యధారణ, యజ్ఞోపవీతధారణ అనంతరం దివ్య మూర్తులకు గరుడోత్సవం జరిగింది. ఆలయ తిరువీధుల్లో స్తంభోద్భవుడిని ఊరేగించారు. అనంతరం దేవతామూర్తులను ఆలయ ప్రవేశం చేయించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా అమర్చుకోకపోతే సౌకర్యాల నిలిపివేత

శ్రీవాణి, డీటీసీ, నల్లగొండ



హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్ అనేది వాహన భద్రత కోసం రూపొందించిన అత్యాధునికమైన విధానం. హెచ్ఎస్ఆర్‌పీ నెంబర్ ప్లేట్ వల్ల దొంగతనం జరిగినా వెంటనే ఆ వాహనాన్ని పట్టుకునే అవకాశాలు ఉంటాయి.ప్లేట్లలో కోడెడ్ స్టిక్కర్లు ఉంటాయి. నెంబర్ ప్లేట్ల గురించి డీటీసీ (డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్) శ్రీవాణితో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

(నల్లగొండ, ఆంధ్రజ్యోతి)

ఫటాఫట్

ఆంధ్రజ్యోతి: హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు అమర్చుకునేందుకు ఎప్పటి వరకు గడువు ఉంది?

డీటీసీ: హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు అమర్చుకోవడానికి ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ వరకు గడువు ఉంది. ప్రతీ వాహనదారుడు ఈ నెంబర్ ప్లేట్‌ను అమర్చుకోవాలి.

ఆంధ్రజ్యోతి: ఏ కేటగిరి వాహనానికి హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్ కోసం ఎంత ధర ఉంది?

డీటీసీ: ద్విచక్రవాహనానికి రూ. 320 నుంచి 380 వరకు ఉండగా, ఇంపోర్టెడ్ ద్విచక్ర వాహనానికి రూ. 400 నుంచి రూ.500వరకు ఉంటుంది. ఫోర్ వీలర్‌కు ప్లేట్‌కు రూ.590 నుంచి రూ.700వరకు ఇంపోర్టెడ్ ఫోర్ వీలర్ వాహనానికి రూ.700 నుంచి రూ.860, త్రీవీలర్ రూ.350 నుంచి రూ.450 వరకు, కమర్షియల్ వాహనానికి రూ.600 నుంచి రూ.800 వరకు ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: నెంబర్ ప్లేట్ అమర్చుకోని వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

డీటీసీ: నిర్ణీత గడువు నాటికి హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు అమర్చుకోని వాహనదారులపై మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారు. వాహనదారులు హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్ల కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. గడువులోగా నెంబర్ ప్లేట్ అమర్చుకోకపోతే బీమా రెనూవల్స్‌ను, ఇతర సౌకర్యాలను నిలిపివేయనున్నారు. అదేవిధంగా కాలుష్య సర్టిఫికెట్ సైతం జారీ చేయబోం. ఆకస్మిక తనిఖీల్లో వాహనదారుల నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోనట్లు తెలిస్తే జరిమానా విధించడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: ఈ నెంబర్ ప్లేట్లను అమర్చుకోవడానికి ఎలాంటి అవగాహన కల్పిస్తారు?

డీటీసీ: ప్రతీ వాహనదారునికి హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్ విషయంలో అవగాహన కల్పిస్తాం. ఈ నెంబర్ ప్లేట్‌లో సెక్యూరిటీ కోడ్ ఉంటుంది. దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఈ నెంబర్ ప్లేట్ వల్ల ఉపయోగం ఉంటుంది.

పాత, కొత్త వాహనదారులకు హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలి. వాహనాలు చోరీకి గురైతే పట్టుకోవడానికి ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈదురుగాలులు
- పిడుగుపాటుకు గొర్రెల కాపరి, పాడి గేదె మృతి
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

నల్లగొండ, మోత్కూరు, గుండాల, నాగారం, దేవరకొండ, గుర్రంపోడు, పెద్దఅడిశర్లపల్లి, చింతపల్లి, నాగారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో ఈదురుగాలుల వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండవేడిమితో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో కొంత ఉపశమనం పొందారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు మండలాల్లో, సూర్యాపేట జిల్లా నాగారంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు తడిసాయి. నల్లగొండ జిల్లా గుర్రంపోడులో పిడుగుపాటుకు గొర్రెల కాపరి దుర్మరణం చెందగా, ఆలేరులో పాడి గేదె మృత్యువాత పడింది. పెద్దఅడిశర్లపల్లి, దేవరకొండ, చింతపల్లి నల్లగొండ, శాలిగౌరారంలో ఈదురుగాలులు, చిరు జల్లులు కురిశాయి.

● యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు, గుండాల తదితర మండలాల్లో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు దఫా దఫాలుగా వర్షం కురిసింది. దీంతో ఆయా మండలాల్లో ప్రభుత్వం ఐకేపీ, సింగిల్ విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. ఆరబెట్టిన ధాన్యాన్ని రాశులు చేయడానికి రైతులు నానా ఇబ్బంది పడ్డారు. ధాన్యం రాశి చేసే లోపు తడిసింది. కొన్ని రాశులపై టార్పాలిన్లు కప్పినా రాశుల కింది నుంచి నీరు వెళ్లి ధాన్యం తడిసింది. వరి కోతలు ముమ్మరంగా సాగుతుండగా ఈ వర్షంతో వరి కోతలకు బ్రేక్ పడింది. మరో వారం రోజులు పొలంలోకి వరికోత యంత్రాలు వెళ్లే పరిస్థితి లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం కేంద్రాల్లో కొనుగోళ్లు వెంటనే ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లు చేయాలని కోరుతున్నారు.



శాలిగౌరారంలో నేలవాలిన పంట



మోత్కూరు మార్కెట్లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

● సూర్యాపేట జిల్లా నాగారం మండలంలో అకాల వర్షానికి ఐకేపీ కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. గురువారం సాయంత్రం మండలంలో అకస్మాత్తుగా గాలిదుమారం ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. అకాల వర్షానికి పొలాల్లో వరి నేలకొరిగింది. మామిడి తోటల్లో చెట్ల కొమ్మలు విరిగి మామిడికాయలు నేలరాలాయి. అకాల వర్షానికి చేతికి వచ్చిన పంట నేలరాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుర్రంపోడులో తడిసిన ధాన్యం వద్ద రైతులు

● నల్లగొండ జిల్లా దేవరకొండలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఎండవేడిమికి ఇబ్బందులు పడిన ప్రజలు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో కొంత ఊరట చెందారు. వర్షంతో పట్టణంలోని ప్రధాన వీధులు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శాలిగౌరారం మండలంలో మధ్యాహ్నం వరకు ఎండ దంచి కొట్టింది. సాయంత్రం భారీ ఈదురుగాలులు వీచడంతో అక్కడక్కడ చెట్లకొమ్మలు, తాటి చెట్లు విరిగి పడ్డాయి. పలు ఇళ్ల రేకులు లేచిపోయాయి. రాత్రి చిరుజల్లులు కురుస్తుండటంతో రైతు లు ఆందోళనకు గురయ్యారు. ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో పోసిన ధాన్యం రాశులపై పట్టాలు కప్పుకున్నారు. నిమ్మ, మామిడి కాయలు రాలి నేలపాలయ్యాయి.

చెట్టు కిందకి వెళ్లి ..



రాములు (ఫైల్ ఫొటో)

గుర్రంపోడు: పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని అములూరు గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మేకల చిన్న రాములు (60) తనకున్న సుమారు 70 గొర్రెలను మేపుకొని జీవనం కొనసాగిస్తున్నా డు. రోజు మాదిరిగానే గొర్రెలను మేపడానికి వెళ్లిన రాములు గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో వర్షం కురుస్తుండటంతో చెట్టు కిందకు వెళ్లాడు. రాములు నిలబడిన చెట్టుకు కొద్ది దూరంలోనే అకస్మాత్తుగా పిడుగు పడటంతో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. రాములుకు కొద్దిదూరంలో ఉన్న అతని చిన్నకుమారుడు అక్కడికి వెళ్లేలోపే విగత జీవిగా మారాడు. మృతుడు రాములుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మంతపురిలో పాడిగేదె

ఆలేరు: మండలంలోని మంతపురి గ్రామంలో పిడుగుపాటుకు పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన రాజిరెడ్డి అనే రైతుకు చెందిన పాడి గేదె మృత్యువాత పడింది. గేదె మృతితో రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ ఎల్లయ్య, రైతు సంఘం నాయకుడు రాములు కోరారు.

హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్ ఉండాల్సిందే

(5వ పేజీ తరువాయి)

ప్లేట్ కోసం రూ.245, కార్లకు రూ.619, భారీ వాహనాలకు 650, ట్రాక్టర్, ట్రాలీకి కలిపి రూ.900వరకు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం వీటి ధరలు మారాయి. వాహనాలకు నెంబర్ కేటాయించిన అనంతరం హైసెక్యూరిటీ ప్లేట్ అమర్చనున్నారు. హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లను అమర్చేందుకు రవాణాశాఖ ప్రైవేట్ ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించింది. సంబంధిత వాహనాల యజమానులు సదరు ఏజెన్సీ వద్దకు వెళ్లి హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై చర్యలు

గతంలో 2013తర్వాత రిజిస్ట్రేషన్ అయిన వాహనాలకు హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్ లేకుంటే రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. తాజాగా 2019 ఏప్రిల్ 1వ తేదీ కంటే ముందు తయారైన అన్ని వాహనాలకు హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలని రవాణాశాఖ ఆదేశాలు జారీ చేసింది. హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్ లేని వాహనాలు ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ లోగా నూతన నెంబర్ ప్లేట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. లేదంటే సదరు వాహన యజమానులపై చర్యలు తీసుకోనున్నారు. హైటెక్ నెంబర్ ప్లేట్ లేని వాహనాలకు సంబంధించిన యాజమాన్య, చిరునామా, బదిలీ, ఫైనాన్స్‌ల హైపోథికేషన్ మార్పు, పన్నుల చెల్లింపులు, పర్మిట్ల జారీ కార్యక్రమాలను నిలిపివేయనున్నారు. హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్ కోసం www.siam.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని రవాణాశాఖ అధికారులు సూచిస్తున్నారు.

నెంబర్ ప్లేట్ల పంపిణీ సాధ్యమయ్యేనా?

వాహనాలకు కచ్చితంగా హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని రవాణాశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేయగా, అయితే ఈ ప్లేట్లు సకాలంలో వాహనదారులకు అందించడం కష్ట సాధ్యమని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలకు రోజుల తరబడి వేచి ఉంటే గానీ నెంబర్ ప్లేట్ రావడం లేదు. రవాణా శాఖాధికారులు వాహన రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన తర్వాత వెంటనే నెంబర్ ప్లేట్ ఇవ్వాలి. కానీ నెంబర్ ప్లేట్లు మాత్రం రోజుల తరబడి కూడా రావడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 9వేల పైచిలుకు నెంబర్ ప్లేట్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. తాజాగా రవాణాశాఖ తీసుకున్న నిర్ణయంతో పాత వాహనాల యజమానులు హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లకు దరఖాస్తులు చేస్తే సకాలంలో వచ్చే అవకాశం లేదంటున్నారు. ఈ విషయంలో రవాణాశాఖాధికారులు స్పందించి నెంబర్ ప్లేట్లు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖలో 'తీన్‌మార్'

(5వ పేజీ తరువాయి)


క్రయ, విక్రయదారులు సమస్యలు ఎదురైనప్పుడు డీఆర్ కార్యాలయాన్ని ఆశ్రయిస్తారు. అయితే వారిని ఉన్నతాధికారి వరకు కూడా వెళ్లనీయకుండా ఈ ముగ్గురు ఉద్యోగులు వసూళ్లకు పాల్పడి కార్యాలయంలో ఫైల్‌ను కదిలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

కోర్టు కేసులు ఉన్నా..

కోర్టుల్లో వివిధ సొసైటీల కేసులు నడుస్తుండగా, ఆ ఫైల్‌ను పక్కన పెట్టాలి. కానీ, డబ్బు చేతులు మారగానే వీటిని కూడా క్లియర్ చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని కోదాడకు చెందిన ఓ ఎడ్యుకేషన్ సొసైటీ విషయం ఇటీవల రచ్చకు దారి తీసింది. సంబంధిత సొసైటీలో విభేదాలు ఏర్పడి ఎవరినైనా తొలగించినప్పుడు ఆ విషయాన్ని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి తెలియజేయాలి. అప్పుడు అధికారులు విచారణ నిర్వహించి న్యాయం ఎవరివైపు ఉంటే వారికి అనుకూలంగా వ్యవహరిస్తారు. కానీ, కోదాడ సొసైటీ విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యహరించినట్లు చర్చ సాగుతోంది. సంబంధిత సొసైటీ నిర్వాహకులు కోర్టును ఆశ్రయించి, సదరు ఫైల్‌ను కదలించవద్దని సంబంధిత కార్యాలయంలో కూడా రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే కోర్టు నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని ఫైల్‌ను కదిలించే ప్రయత్నం సమస్యకు దారి తీసింది. ఈ విషయంలో సెక్షన్ ఉద్యోగి ఒకరు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

అదేవిధంగా హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన ఓ సొసైటీ విషయంలో కూడా ఇలాగే వ్యవహరించిన అధికారులు, ఉద్యోగులు అభాసుపాలైనట్లు సమాచారం. వాస్తవానికి అధికారులు సెక్షన్-23 ప్రకారం జనరల్ బాడీ తీర్మానాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలి. అయితే కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న సమయంలో తీర్పురాక ముందు వివాదాస్పద నిర్ణయం తీసుకోవడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

కోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు



సొసైటీల నిర్వాహకులు కోర్టును ఆశ్రయించిన విషయాన్ని మా దృష్టికి తీసుకువచ్చారు. అయితే ఈ విషయంలో కోర్టు నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. కోదాడకు చెందిన ఎడ్యుకేషనల్ సొసైటీతో పాటు ఇతర సొసైటీల్లో వివాదాలు చోటు చేసుకోవడంతో ఫిర్యాదు చేశారు. అయితే వివాదం పెద్దది కాకుండా చర్యలు తీసుకుంటాం. సొసైటీలతో పాటు ఇతర విషయాల్లో ఎవరైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే శాఖాపర చర్యలు తీసుకుంటాం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం.

● ఎస్.ప్రకాష్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్

అవుట్ సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగుల మధ్య వివాదాలు

ఉమ్మడి జిల్లాలోని కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవుట్ సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగుల మధ్య వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని నెలల క్రితం మిర్యాలగూడ డివిజన్‌లోని ఓ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగుల మధ్య డబ్బు పంపకం విషయంలో తేడా రావడంతో కొట్లాడే పరిస్థితి వచ్చింది. ఈ ఘర్షణకు కారణమైన ఓ ఉద్యోగిని ట్రాన్స్‌ఫర్ చేయగా, తిరిగి పైరవీ చేసుకొని అదే ప్రాంతానికి బదిలీ కావడం గమనార్హం. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎస్ఆర్‌లు కొంతమంది అవుట్ సోర్సింగ్ సిబ్బందిని వారికి అనుకూలంగా చేసుకొని వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. దీంతో రెగ్యులర్ ఉద్యోగులు ఎస్ఆర్‌పై, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై గుర్రుగా ఉంటున్నారు.

సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల నిలిపివేత

నాగార్జునసాగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమకాల్వకు అధికారులు గురువారం సాయంత్రం నీటి విడుదల నిలిపివేశారు. రబీ సాగునీటి అవసరాల కోసం ఎడమకాల్వకు గతేడాది డిసెంబరు 18వ తేదీ నుంచి నీటిని విడుదల చేశారు. వానాకాలానికి 74 టీఎంసీలు, అలాగే ఈ ఏడాది వేసవి సాగునీటి కోసం 70 టీఎంసీలు, రెండు పంటలకు కలిపి మొత్తం 144 టీఎంసీలు నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. సాగర్ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 515.30 అడుగులుగా ఉంది.

వంట గ్యాస్ ధరలు తగ్గించాలి : సీపీఐ

మునుగోడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, పెట్రో, ఇందన ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సురిగి చలపతి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను డిమాండ్ చేశారు. పెంచిన ధరల కారణంగా సామన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థికభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు చేస్తామని ఆర్థికభారం మోపి ఇబ్బందులకు గురిచేయటం అన్యాయమన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడి వైద్యానికి ఎల్‌వోసీ అందజేత

కేతేపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేతేపల్లి మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన కందికంటి అశోక్‌కు మంజూరైన రూ.3లక్షల ఎల్‌వోసీ పత్రాలను గురువారం ఎమ్మెల్యే వీరేశం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, నాయకులు గుత్తా మాధవరెడ్డి, ఎడ్ల ప్రవీణ్, కత్తుల వీరన్న, ఎడ్ల రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని అధిగమిస్తాం



గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంపీడీవో, శాలిగౌరారం

ఇంటర్వ్యూ Interview

వేసవిలో తాగునీటి ఎద్దడిని అధిగమిస్తామని, గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల ఎదుగుదలకు చర్యలు తీసుకుంటామని, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి పనులు చేయాలని ఎంపీడీవో జ్యోతిలక్ష్మి తెలిపారు.
(శాలిగౌరారం, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో ఏఏ పనులు చేపడుతున్నారు?

ఎంపీడీవో: ఉపాధి హామీ పనుల్లో ముఖ్యంగా రైతుల పొలాలకు వెళ్లే రోడ్లు, నీటి కుంటలు, చేపల చెరువుల త్రవ్వకం, అనకట్టలు, భూమి చదును, నర్సరీల పెంపకం తదితర పనులు చేపడుతున్నాం. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: ఉపాధి హామీలో హార్టికల్చర్‌కు సంబంధించిన పనులు ఏమైనా ఉన్నాయా?

ఎంపీడీవో: ఉపాధి హామీలో హార్టికల్చర్ పనులు కూడా ఉన్నాయి. అందులో నిమ్మ, మునగ, డ్రాగెన్, ఆయిల్ పామ్ తోటలను పెంచుకోవచ్చు. మండలంలో ఇప్పటికే పలువురు రైతులు తోటలను సాగు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీడీవో: ప్రస్తుతం ఏ గ్రామంలో నీటి ఎద్దడి లేదు. గ్రౌండ్ వాటర్ తక్కువగా ఉన్న ప్రాంతాలను ముందుస్తుగా గుర్తిస్తున్నాం. గ్రామ పంచాయితీ బోర్లను మరమ్మతులు చేయిస్తాం. ఒకవేళ నీటి ఎద్దడి ఏర్పడితే రైతుల వ్యవసాయ బావుల, బోర్ల నీటిని కొనుగోలు చేసి ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేస్తాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారా?

ఎంపీడీవో: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటి పనులు వసూలు చేస్తున్నాం. ఇప్పటి వరకు 90శాతం వసూళ్లు పూర్తయ్యాయి. గ్రామాల అభివృద్ధి కోసం ప్రతీ ఇంటి యజమాని ఇంటి పన్నులు కట్టాలి.

ఆంధ్రజ్యోతి: పారిశుధ్య నిర్వహణ పనులు ఎలా ఉన్నాయి?

ఎంపీడీవో: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో నిత్యం పారిశుధ్య పనుల మీద మానిటరింగ్ చేస్తున్నాం. అన్ని గ్రామాల్లో ట్రాక్టర్లతో చెత్తను డంపింగ్ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో రాజీవ్ యువవికాసం పథకానికి ఇప్పటి వరకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు?

ఎంపీడీవో: రాజీవ్ యువ వికాసం పథకానికి మంచి స్పందన ఉంది. ఇప్పటి వరకు 750కి పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

- మురుగునీటితో దుర్వాసన
- వరి పొలంలోకి డ్రైనేజీ నీరు
- జాలోనిగూడెంలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

శాలిగౌరారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేయకపోవడంతో ఎక్కడ చూసినా దుర్వాసన వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నెలల తరబడి మురుగుకాల్వలు శుభ్రం చేయకపోవడం, డ్రైనేజీలు లేని వీధుల్లో రోడ్ల మీదనే మురుగునీరు ప్రవహిస్తుండటంతో ఆ గ్రామాలన్నీ అపరిశుభ్రతతో గ్రామస్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. అస్తవ్యస్తమైన డ్రైనేజీ కారణంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది గ్రామ కార్యదర్శులు గ్రామాల పారిశుధ్య పనుల గురించి పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు కూడా పారుశుధ్య పనులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆదేశాలను పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు ఖాతర్ చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. శాలిగౌరారం మండలం జాలోనిగూడెం గ్రామంలో గతేడాది నుంచి మురుగునీరు ఇళ్ల మధ్య పారుతుండటంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెలువడుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఎక్కడ పడితే అక్కడే పెంట కుప్పలు పోయడం, గ్రామ మురుగునీరు వెళ్లే మార్గం లేక పోవడంతో గ్రామమంతా ఈగలు, దోమలతో సహవాసం చేస్తున్నారు. గ్రామంలో డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో గ్రామ శివారులోని పొలాలకు వెళ్తున్నాయి. గ్రామానికి చెందిన గుడ్డెటి శంకర్ వరి పొలంలోకి గతేడాది నుంచి డ్రైనేజీ నీరు పొలంలోకి వస్తుండటంతో ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు నీటిని అరికట్టాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కోతకు వచ్చే దశలో కూడా మురుగు నీరు రావడం వల్ల పంటంతా కుళ్లిపోతుందని వాపోతున్నాడు. వ్యవసాయ పొలంలోకి వస్తున్న మురికి నీటిని అరికట్టి, గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.


జాలోనిగూడెంలో ఇళ్ల పక్కనే ప్రవహిస్తున్న మురుగునీరు


వరి పొలంలోకి ప్రవహిస్తున్న గ్రామ మురుగునీరు

మురుగు నీటితో పొలం పాడవుతుంది



జాలోనిగూడెంలో ఇళ్ల పక్కనే వరి పొలం ఉంది. ఈ పొలంలోకి గ్రామంలోని డ్రైనేజీ నీరంతా వచ్చి చేరుతుంది. దీంతో పొలం మొత్తం దుర్వాసన వస్తుంది, పంట దిగుబడి రావడం లేదు. పక్కనే ఉన్న ఇళ్లల్లోని ప్రజలు కూడా మురుగునీటి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఈగలు, దోమలు ఇక్కడ వ్యాప్తి చెంది అంటు వ్యాధులు వస్తున్నాయి. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరి ష్కరించాలని కోరారు.

-శంకర్, రైతు, జాలోనిగూడెం

సంక్షేమ పథకాల అమలులో విఫలం

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి


నాంపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

మర్రిగూడ, నాంపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మర్రిగూడ, నాంపల్లి మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను విస్మరిందిందని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనట్లు తెలిపారు. కేసీఆర్ హయంలో రైతులకు నాణ్యమైన 24గంటల విద్యుత్ సరఫరా, రైతుబంధు, ప్రతీ రోజు ఇంటింటికీ నల్లా నీరు అందించినట్లు పేర్కొన్నారు. నేడు రైతులకు విద్యుత్ సక్రమంగా ఇవ్వక పోవడంతో రైతుల పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. తాగునీరు, విద్యుత్ సమస్యను పరిష్కరించడంలో, రైతు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం అటు ప్రజలను ఇటు రైతులను మోసం చేసిందని ఆరోపించారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటై 25 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా 27వ తేదీన నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

● మర్రిగూడలో పార్టీ మండల అధ్యక్షుడు తోటకూర శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు పాల్వాయి స్రవంతిరెడ్డి, బచ్చు రామకృష్ణ, వెంకటరమణారెడ్డి, కొలుకులపల్లి యాదయ్య, బాలం నర్సింహ, లక్ష్మినర్సింహ, అంతిరెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

● నాంపల్లిలో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, మండల అధ్యక్షుడు గుమ్మడపు నర్సింహారావు, పూదరి సైదులు, పోగుల వెంకట్‌రెడ్డి, కడారి శ్రీశైలం, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, బాషిపాక రాములు, నక్క చంద్రశేఖర్, సపావత్ సర్దార్‌నాయక్, ఇట్టేం వెంకట్‌రెడ్డి, రామాంజనేయులు, శ్రీలత, వెంకటేశ్వర్లు, సలీం, సైదులు, శేఖర్‌రెడ్డి, బెల్లి సత్తయ్య, గౌరు కిరణ్, పాండు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సామాజిక అణచివేత, శ్రమ దోపిడీ, కుల వివక్ష నిర్మూలనకై పోరాడుదామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవనంలో సీఐటీయూ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం న్యాయం అవగాహన అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కుల వ్యవస్థ పట్టిపీడిస్తోందని, మనువాద సిద్ధాంతాన్ని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలనే ఒక దుర్మార్గమైన ఆలోచనను బీజేపీ ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. కుల, మత, వర్గ విభేదాలతో కార్మికవర్గం ఐక్యతకు భంగం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూజిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, ఎండి దండంపల్లి సత్తయ్య, నర్సింహ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీను అమలుచేయాలి: బీజేపీ


చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో వీధులను శుభ్రం చేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు పీక వెంకన్న, నాయకులు

చిట్యాల రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పీక వెంకన్న, అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ డిమాండ్ చేశారు. 'గావ్ చలో అభియాన్' కార్యక్రమంలో భాగంగా గురువారం చిట్యాల మండలం గుండ్రాంపల్లి, వెలిమినేడు, సుంకెనపల్లి, పిట్టంపల్లి, బొంగోనిచెర్వు, పేరేపల్లి, ఏపూర్ గ్రామాల్లో బీజేపీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. వీధులను చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. గుండ్రాంపల్లిలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు అమలుకు నోచుకోనదున ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహ, బొడిగె లక్ష్మయ్య, మైల పరమేష్, ఆకుల వెంకన్న, నర్రా గోపాల్‌రెడ్డి, పున్న విష్ణు, గరిషె నరేష్, నీల నర్సింహ, బుంగ రాజేందర్, సాయికిరణ్, మురాల తిరుమలేష్, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి


చిట్యాలలో జాతీయ రహదారి పనులను పరిశీలిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చిట్యాలలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం సందర్భంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలుగుకుండా చూడాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి కోరారు. గురువారం చిట్యాలలో నిర్మాణ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీస్ రోడ్లపై లైట్లను సక్రమంగా వెలిగేలా చూడాలన్నారు. హైవేపై ట్రాఫిక్ జాం, ప్రమాదాలు జరగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఎస్ఐ ధర్మ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గట్టుప్పల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాములు అన్నారు. గురువారం తేరట్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు వేసవిలో నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రజలు ఎండల సమయంలో ఎలాంటి పనులు పెట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాధవరెడ్డి, గ్రామ ప్రత్యేక అధికారి రేవతి, పంచాయతీ కార్యదర్శులు షఫీ, శివ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగనాథం, మాజీ ఎంపీటీసీ గొరిగె సత్తయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో గర్భిణులకు సీమంతాలు


గర్భిణులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న ఏసీడీపీవో వెంకటమ్మ

చిట్యాలరూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం వెలిమినేడు, బొంగోనిచెర్వు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ ఏసీడీపీవో వెంకటమ్మ పాల్గొని గర్భిణులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని సదద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తాటికొండ లింగస్వామి, విక్రమ్, నాగమణి, రేణుక, అండాలు, పద్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

- శాలిగౌరారంలో ప్రారంభమైన బడి బాట


బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

శాలిగౌరారం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని శాలిగౌరారం జడ్పీ హైస్కూల్ స్కూల్ హెచ్ఎం కోట మల్లయ్య అన్నారు. శాలిగౌరారంలో గురువారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ జమ్ము శ్రీలత, ఉపాధ్యాయులు రామచంద్రయ్య, మల్లిఖార్జునరావు, లింగయ్య, సైదిరెడ్డి, సుధాకర్, మెసెంజర్ పరమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


నకిరేకల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జమీరుద్దీన్


నకిరేకల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రాలను తీసుకువస్తున్న ధాన్యాన్ని వేగంగా కొనుగోళ్లు చేపట్టాలని తహసీల్దార్ జమీరుద్దీన్ అన్నారు. నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తున్న రైతులకు మౌలిక సదుపాయలు కల్పించాలన్నారు. ధాన్యం రైస్ మిల్లులకు వెళ్లిన రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమయ్యే విధంగా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు దళారులకు ధాన్యం అమ్ముకుని మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, డీసీవో పత్యా నాయక్, ఏవో జానిమియా, ఏఈవో లింగయ్య, నకిరేకల్ పీఏసీఎస్ సిబ్బంది నాగరాజు, సైదులు తదితరులు పాల్గొన్నారు.


● కేతేపల్లి: మండలంలోని చీకటిగూడెం, కొత్తపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా కేంద్రాల్లోకి ఇప్పటి వరకు రైతులు తీసుకువచ్చిన ధాన్యం నిల్వలు, కొనుగోలు చేసిన ధాన్యం, ఎగుమతి తదితర వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు. అలాగే కేంద్రాల్లోని రైతులతో మాట్లాడి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం నిర్ధీత తేమ శాతం ఉంటే వెంటనే కొనుగోలు చేయాల ని ఆదేశించారు. నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని రైతులను కోరారు. తహసీల్దార్ వెంట ఏవో బి.పురుషోత్తం, ఏఈవో జి.బాలరాజు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మర్రిగూడ: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, శివన్నగూడ వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్ బాల నరసింహులు అన్నారు. గురువారం మండలంలోని శివన్నగూడ, ఖుదాబ్‌పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బక్క శ్రీనివాస్, డీసీవో శివకుమార్, మేతరి యాదయ్య యాదగిరిరావు, రామదాస్ శ్రీనివాస్, మాల్ మార్కెట్ వైస్‌చైర్మన్ నక్క శ్రీను, రమావత్ సూర్య, ఏవో సహస్, ఏఈవోలు సుజాత, అరుణ, మధు పాల్గొన్నారు.

నల్లగొండరూరల్: నల్లగొండ మండలంలోని అన్నపూర్ణ సహాయక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని దండెంపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ డైరెక్టర్ మల్లేపోయిన ఆంజనేయులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అల్లి శంకర్, ఎల్లమ్మ, బాలరాజు, నర్సింహారావు పాల్గొన్నారు.


కేతేపల్లి : చీకటిగూడెం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్


మర్రిగూడ : కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి

పీడిత ప్రజలను చైతన్యం చేసిన కానూరి


నకిరేకల్‌లో కానూరి వెంకటేశ్వర్‌రావు స్తూపం ఎదుట నివాళులర్పిస్తున్న నాయకులు

నకిరేకల్, ఏప్రిల్ 10, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పీడత ప్రజలను అరుణోదయ వ్యవస్థాపకుడు, విప్లవకవి, గాయకుడు కానూరి వెంకటేశ్వర్‌రావు చైతన్యం చేశా రని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకుడు ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కానూరి వెంకటేశ్వర్‌రావు వర్ధంతిని గురువారం నకిరేకల్‌లోని యానాల మల్లారెడ్డి స్మారక భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. వెంకటేశ్వర్‌రావు ఆశయాలను నేటి యువత సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి రాయి కృష్ణ, ఇందూరు సాగర్, గజ్జి రవి, మామిడోజు వెంకన్న, బండారు వెంకన్న, నర్సింహ, పుట్ట సత్తయ్య, అనిల్, అయోధ్య, ప్రభాకర్, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు లాభాలు చేకూర్చడమే మోదీ లక్ష్యం

- వ్యకాస రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య


కూలీలలో కలిసి మాట్లాడుతున్న నారి అయిలయ్య

చిట్యాలరూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలపై ధరల భారాన్ని మోపి కార్పొరేట్ కంపెనీలకు లాభాలను చేకూరచడమే ప్రధాని మోదీ లక్ష్యమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య అన్నారు. చిట్యాల మండలం తాళ్లవెల్లంలలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలు, కూలీ డబ్బులతో కార్మికులు, కూలీలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలను పెంచి పేద, సామాన్య కుటుంబాలపై భారం మోపడం సిగ్గుచేటని విమర్శించారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.50పెంచి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారిపై పుండుమీద కారం చల్లిన చందంగా ఉందన్నారు. మోదీ ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడమే కాకుండా పెట్రోల్, డీజిల్‌పై సుంకాన్ని పెంచడం మరీ దారుణమన్నారు. వెంటనే గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉపాధి కూలీల గ్రామకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బత్తుల పద్మ, ఉపాధ్యక్షురాలు జనగాం శారద, కార్యదర్శి పగడోజు నాగలక్ష్మి సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల లింగస్వామి, మండల సహాయకార్యదర్శి నకిరేకంటి రాములు, ఎల్లయ్య, పద్మ, అంజమ్మ, శారద, సంతోష, నాగలక్ష్మి, కవిత, లిఖిత, రమణ, అరుణ, పూలమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.


20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


గట్టుప్పల్ రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

గట్టుప్పల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గట్టుప్పల్ మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ దగ్గర గురువారం తెల్లవారు జామున పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తూ నారాయణపురం మండలం దాపుతండాకు చెందిన దశరథ బొలెరో వాహనంలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, పట్టుకున్న బియ్యాన్ని చండూరు సివిల్ సప్లై అధికారులకు అప్పగించామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శుక్రవారం 11 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.152	225	255
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.5 । కనిష్ఠం 24.4

ఎండ




ఎండ వేడిమితో నిర్మానుష్యంగా మారిన యాదగిరిగుట్ట దివ్యక్షేత్రం

గురువారం ఉష్ణోగ్రత మండలం	గరిష్ఠం (డిగ్రీల్లో)
అడ్డగూడూరు	40.9
నారాయణపురం	40.8
ఆత్మకూరు(ఎం)	40.7
బొమ్మలరామారం	40.5
గుండాల	40.5
మోత్కురు	40.4
మోటకొండూరు	40.4
చౌటుప్పల్‌లో	40.4
రామన్నపేటలో	40.3
ఆలేరులో	40.1
బీబీనగర్‌లో	40.1
పోచంపల్లిలో	40.1
వలిగొండలో	40
యాదగిరిగుట్ట	39.9
రాజపేట	39.9
భువనగిరి	39.9
తుర్కపల్లి	39.9

యాదాద్రి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు రోజురోజుకూ అనూహ్యంగా పెరుగుతున్నాయి. జిల్లా ఎల్లో జోన్ నుంచి అలెర్ట్ జోన్‌కు చేరుకుంటోంది. వాతావరణ శాఖ ప్రకారం 35 నుంచి 40 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఎల్లో జోన్ కాగా, 40 నుంచి 45 డిగ్రీలు నమోదైన పక్షంలో అలెర్ట్ (అప్రమత్తం)జోన్‌గా ప్రకటిస్తారు. అయితే ఏప్రిల్ నెలలో జిల్లాలోని పలు మండలాల్లో 38 డిగ్రీల నుంచి 40డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఈ సీజన్‌లో మొదటిసారిగా ఏప్రిల్ రెండోవారంలోనే అలెర్ట్ జోన్ పరిధిలోకి చేరింది. జిల్లాలో బుధవారం వరకు 39 డిగ్రీలకుపైగా వరకు నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు గురువారం జిల్లాలోని పలు మండలాల్లో 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు మండుతున్నాయి. మేనెలలో పెరిగే ఎండలు ఈ సారి ముందస్తుగానే మండుతున్నాయి. వేడి గాలులకు వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్ రెండోవారంలోనే ఎండలు ఈ విధంగా ఉంటే., ఇక మే నెలలో ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో లేనివిధంగా ఈసారి 44 డిగ్రీలకుపైగానే నమోదు కానున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

వాన



జిల్లా కేంద్రంలో మబ్బులు పట్టి మెరుస్తున్న ఆకాశం

గురువారం వర్షపాతం మండలం	(మి.మీ.లో)
గుర్రంపోడు	28.8
కొండమల్లేపల్లి	12.5
నల్లగొండ	17.3
పీఏ.పల్లి	10.5
గుండ్లపల్లి	8.0
చింతపల్లి	5.5
మర్రిగూడ	5.5

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో గురువారం సాయంత్రం ఈదురుగాలుల వాన కురిసింది. అడ్డగూడూరు మండలంలో అత్యధికంగా 40.9డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, సాయంత్రం వేళ ఆలేరు మండలంలో 2.5సెంటీమీటర్ల వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి ఎండవేడిమితో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రం వాతావరణం చల్లబడంతో కొంత ఉపశమనం పొందారు. మోత్కూరు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ధాన్యం రాశులు తడిసిపోవడంతో, రాశుల కింద నీటిని తొలగించేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలోనూ పలు మండలాల్లో ఈదురుగాలులతో చిరుజల్లులు కురిశాయి. నాగారం మండలంలో అకాల వర్షానికి ఐకేపీ కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. గురువారం సాయంత్రం మండలంలో అకస్మాత్తుగా గాలిదుమారం ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. అకాల వర్షానికి పొలాల్లో వరి నేలకొరిగింది. మామిడి తోటల్లో చెట్ల కొమ్మలు విరిగి మామిడికాయలు నేలరాలాయి. నల్లగొండ జిల్లాలోనూ పలు మండలాల్లో ఈదురుగాలుల వాన కురిసింది.

7

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)



రిజిస్ట్రేషన్ల శాఖలో

తీన్‌మార్

- వసూళ్ల కోసం ముగ్గురు ఉద్యోగుల సిండికేట్
- సొసైటీల విషయంలో ఇష్టారాజ్యం
- కోర్టుల్లో కేసులున్నా కదులుతున్న ఫైళ్లు
- అభ్యంతరాలను పట్టించుకోని ఉద్యోగులు. అధికారులు
- చేతులు మారుతున్న లక్షల రూపాయలు

నల్లగొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయంలో కొందరు ఉద్యోగుల ఇష్టారాజ్యంగా మారింది. కొన్ని రోజుల వరకు ఇన్‌చార్జి అధికారి ఉండగా, ఇటీవలే పూర్తి స్థాయి అధికారి సెలవుల నుంచి తిరిగి వచ్చారు. ఇన్‌చార్జి అధికారి ఉన్న సమయంలో కార్యాలయం అదుపుతప్పిందనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం కార్యాలయంలో ముగ్గురు ఉద్యోగులు సిండికేట్‌గా మారి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉండే కార్యాలయంలో వీరి చేయి తడవనిదే ఏ ఒక్క ఫైల్ కదలదని పలువురు బాధితులు పేర్కొంటున్నారు. ఆస్తుల మిగతా 7వ పేజీలో...

హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్

ఉండాల్సిందే





గడువులోగా అమర్చుకోకపోతే

సౌకర్యాల నిలిపివేత

డీటీసీ శ్రీవాణి 7

ఫటాఫట్ FATAFAT

- లేదంటే రవాణాశాఖ చర్యలు
- ఉమ్మడి జిల్లాలో 9లక్షలకు పైగా వాహనాలు
- సెప్టెంబరు 30 వరకు గడువు
- పంపిణీ సాధ్యమేనా?

● ఫీజులు ఇలా..

వాహనం	ఫీజు
బైక్	రూ.320-రూ.380
దిగుమతి చేసుకున్న బైక్	రూ.400-రూ.500
నాలుగు చక్రాల వాహనం	రూ.590-రూ.700
దిగుమతి చేసుకున్న నాలుగు చక్రాల వాహనం	రూ.700-రూ.860
మూడు చక్రాల వాహనం	రూ.350-రూ.450
వాణిజ్య వాహనం	రూ.600-రూ.800

రహదారులపై తిరిగే ప్రతీ వాహనానికి హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని రవాణాశాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. గతంలో వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించగానే తెలుపు రంగులో ఉండే ప్లేట్‌పై నలుపు రంగు అక్షరాలతో కూడిన నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకునేవారు. ట్యాక్సీ వాహనం అయితే పసుపు రంగు ప్లేట్ అమర్చాలి. ప్లేట్‌పై నంబర్లు ఇష్టం వచ్చినట్టుకాకుండా ఒక క్రమ పద్ధతిలో ఉండాలి. అయితే కొంత మంది వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకునేవారు. దీంతో 2013లో రవాణాశాఖ నూతన నెంబర్ ప్లేట్ల విధానాన్ని తీసుకొచ్చింది. హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లను అమలులోకి తెచ్చింది. వీటిని తప్పని సరి చేస్తూ తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

● ఆంధ్రజ్యోతి, సూర్యాపేటక్రైం

ప్రస్తుతం వాహనదారులు వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలోనే హైసెక్యూరిటీ ప్లేట్‌కు సంబంధించిన చార్జీని వసూలు చేస్తున్నారు. నెంబర్ కేటాయించిన తర్వాత సంబంధిత ఏజెన్సీ ద్వారా హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్‌ను సంబంధిత వాహనానికి అమర్చుతున్నారు. అయితే కొంత మంది వాహనదారులు హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవడంలేదు. వారు సొంతంగా నెంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాలతోనే హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు అమలులోకి వచ్చాయి. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల అమలు విషయంలో రవాణాశాఖ ఉదాసీనంగా ఉండడం, పాత వాహనాలకు హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు లేకపోవడాన్ని తీవ్రంగా పరిగణించి ఇటీవల కేంద్రానికి కీలక సూచనలు చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో చేసేది లేక రవాణాశాఖాధికారులు హైసెక్యూరిటీ ప్లేట్ ఏర్పాటు చేసుకోని వాహనాలపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది.

● 9లక్షలకు పైగా వాహనాలు

ఉమ్మడి జిల్లాలో అన్ని రకాల వాహనాలు 9,59,445 వరకు ఉన్నాయి. అందులో సూర్యాపేట జిల్లాలో 2,02,181, నల్లగొండ జిల్లాలో 5,14,675, యాదాద్రి జిల్లాలో 2,42,589 వాహనాల వరకు ఉన్నాయి. అయితే వీటిలో సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయని వాహనాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, నల్లగొండ, మిర్యాలగూడ, భువనగిరి రవాణాశాఖ కార్యాలయాల పరిధిలో ఆయా వాహనాలకు సంబంధించిన నెంబర్ ప్లేట్లు అమర్చేందుకు ఏజెన్సీలు ఉన్నాయి. హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లతో వాహనం పూర్తి వివరాలు రవాణాశాఖ వెబ్‌సైట్‌లో ఉంటాయి. అంతేగాక సంబంధిత నెంబర్ ప్లేట్‌ను మార్పు చేసే అవకాశాలు తక్కువగా ఉంటాయి. దీంతో వాహనాలు చోరీకి గురైనప్పుడు ఛేదనలో ఈ సమాచారం ఉపయోగపడుతుంది.

2013 నుంచి హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్

రవాణాశాఖ 2013 నుంచే హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లను అమలులోకి తెచ్చింది. వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించే సమయంలోనే హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్ ఫీజును కూడా రవాణాశాఖ వసూలు చేస్తోంది. బైక్‌లకు నెంబర్

మిగతా 7వ పేజీలో...

డిగ్రీ పరీక్షలు వాయిదా

బకాయిల కోసం పట్టువీడని యాజమాన్యాలు, లెక్చరర్లు



ఈ నెల 11వ తేదీ నుంచి మే 6 వరకు జరగాల్సిన డిగ్రీ పరీక్షలు వాయిదా పడ్డాయి. దీంతో మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని సుమారు 86 ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సుమారు 25 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయలేని పరిస్థితి. తమకు రావల్సిన సుమారు రూ.100 కోట్ల ఫైబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తేనే పరీక్షల నిర్వహణకు సహకరిస్తామని కళాశాలలు భీష్మించుకు కూర్చున్నాయి. 6 (ఆంధ్రజ్యోతి- భువనగిరిటౌన్)

నేడు కలెక్టరేట్‌లో ప్రత్యేక 'ప్రజావాణి'

నల్లగొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం శుక్రవారం ప్రత్యేక 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక 'ప్రజావాణి'కి వచ్చిన దరఖాస్తులు తిరిగి రాకుండా సమస్యను పరిష్కరించేలా తహసీల్దార్లకు ఆర్డీవోలు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు.

నెల రోజులు పోలీస్ యాక్ట్ : ఎస్పీ

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల పాటు 30, 31 (ఎ) పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించవద్దన్నారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మిర్యాలగూడ బార్ అసోసియేషన్

అధ్యక్షుడిగా సత్యనారాయణ

● ఎన్నికలో 92 ఓట్లతో గెలుపు 8

మద్దతు ధర చెల్లించకుంటే చర్యలు

- అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- మిల్లర్లను హెచ్చరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యానికి మద్దతు ధర చెల్లించకుంటే చర్యలు తప్పవని అధికారులు, ప్రజాప్రతినిధులు మిల్లర్లను హెచ్చరించారు. రెండు రోజులుగా ధాన్యాన్ని మిల్లర్లు తక్కువకు కొనుగోలు చేస్తున్నారని, మద్దతు ధర చెల్లించడం లేదని 'ఆంధ్రజ్యోతి' మెయిన్, మినీలో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడు తూ, శెట్టిపాలెం ప్రాంతంలో రెండు మిల్లులు ధర విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, తీరు మారకుంటే మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాట్లాడుతూ, తాను బుధవారం మధ్యాహ్నం 3.30గంటల ప్రాంతంలో శెట్టిపాలెం మిల్లుల వద్దకు వెళ్లగా ఒక్క ధాన్యం ట్రాక్టర్ కనిపించలేదని, తిరిగి 4 గంటలకు 45 ట్రాక్టర్లు రోడ్డువెంట బారులు తీరి కన్పించాయన్నారు. రైతులను అడగ్గా, మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయడంలేదని చెప్పారని పేర్కొన్నారు. లీగల్ మెట్రాలజీ అధికారులతో కాంటాలను తనిఖీ చేయించగా, ఓ మిల్లు వద్ద 10 టన్నులకు 40 కిలోల తూకం తక్కువగా వచ్చిందని తేలిందన్నారు. మిల్లర్లు గత సమావేశంలో చెప్పిన కారణాలే తిరిగి చెప్పకుండా మిల్లర్స్ అసోసియేషన్ ఏం చర్యలు తీసుకుందో చెప్పాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. గతంలో ఓ రకం ధాన్యం కొనుగోలు చేయలేదని, ధర తగ్గిస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. సమావేశంలో పౌరసరఫరాలశాఖ డీఎం హరీష్, తహసీల్దార్ హరిబాబు, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, నాయకులు మహానంద చౌదరి, బండారు కుశలయ్య, పాల్గొన్నారు.

తండాల్లో వసతుల కల్పనకు చర్యలు : కలెక్టర్



బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ధర్తీ అబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ ద్వారా గిరిజన తండాల్లో మౌలిక వసతులకు చర్యలు తీసుకుంటున్నామని, అందుకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం నందికొండ మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తిరుమలగిరి, పెద్దవూర, సాగర్, త్రిపురారం మండలాల్లో గుర్తించిన 18 తండాల్లో రూ.95కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. తండాల్లో సోలార్ మోటార్ పంపుల ద్వారా తాగునీటిని అందించేందుకు అంచనాలు రూపొందించాలన్నారు. అధికారులకు సూచించారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, అధికారులు రాజ్‌కుమార్, శేఖర్‌రెడ్డి, వెంకయ్య, చరిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. గురువారం నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీదవాఖానాను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. త్వరలో హాలియాలో సైతం బస్తీ దవాఖానాను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



మాడ్గులపల్లిలో ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నల్లగొండటౌన్, నల్లగొండ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అమలుకాని హామీలు ఇచ్చి రైతులను మోసం చేసిందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అర్జాలబావి ఐకేపీ కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. జిల్లాలో 354 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కేవలం 50 కేంద్రాలు ప్రారంభించి అధికారులు చేతులు దులుపుకున్నారన్నారు. సన్న ధాన్యంతోపాటు దొడ్డు రకాలకు సైతం రూ.500 బోనస్ ఇవ్వాలని, గత ఏడాది ఇవ్వాల్సిన బోనస్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై చిన్నచూపు చూస్తోందని, కొనుగోలు కేంద్రాల్లో సరైన వసతులు కల్పించడంలేదని విమర్శించారు. రానున్న రోజుల్లో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు పాపయ్యగౌడ్, పడమటి జగన్మోహన్‌రెడ్డి, బీపంగి జగ్జీవన్, పాలకూరి రవి, పోతెపాక లింగస్వామి, యాదగిరిచారి, మిర్యాల వెంకన్న, గడ్డం వెంకట్‌రెడ్డి, భిక్షంరెడ్డి, అశోక్‌రెడ్డి, పక్కీరు మోహన్‌రెడ్డి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తార, తదితరులు పాల్గొన్నారు.

అధిక తూకంపై ప్రభుత్వం స్పందించాలి

(ఆంధ్రజ్యోతి, తిప్పర్తి, మాడ్గులపల్లి): ధాన్యం కొనుగోలు సమయంలో అధిక తూకం వేయడంపై ప్రభుత్వం స్పందించాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం తిప్పర్తి మార్కెట్ యార్డు, మాడ్గులపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులను మార్కెట్ నిర్వాహకులు, మిల్లర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులతోపాటు నిరంజన్‌రెడ్డి, వంగూరి రవి, ఇటికాల జాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దామరచర్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ పరిధిలోని దామరచర్ల టౌన్, నర్సాపురం, బొత్తలపాలెం, వాచ్యతండా, వాడపల్లి, దామరచర్ల ఏజీ ఎల్, దామరచర్ల లిఫ్ట్, టీవీగూడెం ఏజే ఎల్ ఫీడర్ల కింద ఉన్న గ్రామాలక సరఫరా ఉండదని ఏఈ అబ్దుల్ హబీబ్ గురువారం తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

చింతపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యావని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకటొరెడ్డి విమర్శించారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

శేషగిరిశర్మ, ఎంపీడీవో, మిర్యాలగూడ



మిర్యాలగూడ మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో శేషగిరిశర్మ తెలిపారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

(ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ రూరల్)

ఇంటర్వ్యూ Interview

ఆంధ్రజ్యోతి: మండలంలో తాగునీటి ఎద్దడికి తీసుకున్న చర్యలేంటి?

ఎంపీడీవో: మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీల్లో పైపులైన్ల ద్వారా తాగునీటి సరఫరా చేపడుతున్నాం. కలెక్టర్ ఆదేశానుసారం 30 గ్రామాల్లో మైనర్ మరమ్మతు పనులు చేపట్టాం. పంచాయతీ కార్యదర్శులకు వాట్సాప్‌గ్రూప్ ఏర్పాటు చేసి సమస్య పై ప్రతిరోజు చర్చిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : నీటి వృథా అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎంపీడీవో: పైపులైన్ల ద్వారా నీటి వృథా జరగకుండా కుళాయిలు ఏర్పాటు చేయించేలా చర్యలు చేపట్టాం. నీటి వృథా జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పారిశుధ్య నిర్వహణకు ఎలాంటి చర్యలు చేపడు తున్నారు?

ఎంపీడీవో : అన్ని గ్రామాల్లో పారిశుధ్య సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాం. పంచాయతీ సిబ్బంది సహకారంతో వీధుల్లో చెత్తను తరలించి గ్రామాల్లో ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయా?

ఎంపీడీవో: మండలంలోని గ్రామాలకు నియమించబడిన ప్రత్యేకాధికారుల సమక్షంలో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించే విధంగా ఆయా గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులకు అవగాహన కల్పించాం. ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నాం.

కేంద్రాల నిండా ధాన్యం రాశులు

● నిడమనూరు మండలంలో 8 కేంద్రాల ఏర్పాటు ● కాంటాల కోసం రైతుల ఎదురుచూపులు

నిడమనూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కేంద్రాలకు ధాన్యం రాక మొదలైంది. ఈ సీజన్‌లో మండలంలో నిడమనూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో రెండు, వెనిగండ్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో రెండు, నాలుగు ఐకేపీ మొత్తం 8 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వేంపాడ్, ముప్పారం, మారుపాక, ఊట్కూరు, సూరేపల్లి కేంద్రాల్లో దొడ్డు రకం కాగా మిగతా నిడమనూరు, నారమ్మగూడెం, రాజన్నగూడెం కేంద్రాల్లో సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సీజన్‌లో ఆయకట్టు, నాన్ ఆయకట్టు గ్రామాల్లో రైతులు మునుపెన్నడూ లేని విధంగా మండలంలో 35వేల పైచిలుకు ఎకరాల్లో వరి సాగు చేశారు. సాగర్ కాల్వలకు నీటిని విడుదల చేయడంతో పాటు బోర్లు, బావుల్లో సమృద్ధిగా నీరు ఉండటంతో పంటల సాగు గణనీయంగా పెరిగింది. దిగుబడులు కూడా పెద్ద మొత్తంలో రానున్నాయి. కొందరు పొలాలు కోయగానే ధాన్యాన్ని నేరుగా మిల్లులకు విక్రయిస్తున్నారు. మరి కొందరు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. అయితే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావడంతో కేంద్రాలు ధాన్యం రాశులతో కళకళలాడుతున్నాయి.



నిడమనూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

ఎక్కడ చూసినా ధాన్యం రాశులే

కేంద్రాల్లో ఎక్కడ చూసినా ధాన్యం రాశులే ఉన్నాయి. కేంద్రాల్లో 17 శాతం తేమ ఉన్న నాణ్యమైన గ్రేడ్ వన్ రకం ధాన్యానికి రూ.2,320, గ్రేడ్ టూ రకం ధాన్యానికి రూ.2,300 ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోంది. ఇందులో సన్న ధాన్యానికి అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా అందిస్తుంది. కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో కొనుగోళ్లు చేపట్టడం లేదు. ముప్పారం, నారమ్మగూడెం, సూరెపల్లి కేంద్రాల్లో ఇంకా కాంటాలు మొదలు కాలేదు. క్వింటాలుకు రూ.20 ఇవ్వాలంటూ హమాలీలు ముప్పారంలో ఇంకా కాం టాలు వేయడం లేదు. దీంతో రైతులు కాంటాల కోసం ఎదురుచూస్తున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకొని పూర్తి స్థాయిలో కొనుగోళ్లు చేపట్టాల్సి ఉంది. నాణ్యమైన సరుకు తెచ్చి మద్దతు ధర పొందాలని, కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

కొనుగోళ్లు చేపడుతున్నాం



సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాలకు గాను రాజన్నగూడెం కేంద్రంలో కొనుగోళ్ల ప్రారంభించాం. మరో కేంద్ర ంలో కూడా కాంటాలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. చివరి ధాన్యం గింజ వరకు రైతుల నుంచి కొనుగోలు చేస్తాం. కేంద్రాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

-నలపరాజు వెంకన్న,
వెనిగండ్ల సొసైటీ ఇన్‌చార్జి కార్యదర్శి

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణపట్టెలో కొన్నేళ్లుగా అక్కడి రైతులు వరి సాగు చేస్తున్నప్పటికీ ఈ ప్రాంతంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధి కారులు ఏర్పాటు చేయలేదు. దీంతో 'కొను గోలు కేంద్రాలను ఏర్పాటు చేయరూ' అనే శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి స్పందించారు. ఈ ప్రాంత రైతుల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తానని రైతులకు చెప్పడంతోపాటు డీఆర్‌డీఏ పీడీని కేంద్రాల ఏర్పాటుపై ఆదేశించారు. ఈ క్రమంలో పీడీ శేఖర్‌రెడ్డి, కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చింతల పాలెం, నాయకునితండాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఐకేపీ ఏపీఎం నరసింహాను ఆదేశించారు. దీంతో ఏపీఎం గురువారం చింతలపాలెం, నాయకునితండా లకు వెళ్లి కేంద్రాల ఏర్పాటుకు అనువైన స్థలాలను స్థానిక సమభావన సంఘాల సభ్యులతో కలిసి పరిశీలించారు. రెండు మూడు రోజుల్లో ఆయా గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తానమని ఆయన పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షలు బహిష్కరిస్తున్నాం

చింతపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో కేటి నుంచి నిర్వహించనున్న డిగ్రీ పరీక్షలు బహిష్కరిస్తున్నట్లు యూనివర్సిటీ అసోసియేషన్ ఆర్గనైజర్ సెక్రటరీ సూదినమోని హన్మంతు తెలిపారు. మండలంలోని వెంకటేశ్వరనగర్ (మాల్)లో గురువారం విద్యార్థులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల నిర్వహణ అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో కదారి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

వేములపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఐకేపీ కేంద్రాల్లోకి రైతులు తరలించిన ధాన్యానికి వెంటనే కాంటాలు నిర్వహించాలని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సల్కునూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఐకేపీ కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తరలించి సుమారు 15రోజులు కావొస్తున్నప్పటికీ నిర్వాహకులు కాంటాలు నిర్వహించకుండా కాలయాపన చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బిల్లా కనకయ్య, జిల్లా యాదగిరి, మద్దిరాల రంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి

హాలియా, తిరుమలగిరి (సాగర్), ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. అనుముల మండలం కొరివేనిగూడెం, తిరుమలగిరి(సాగర్) మండలం నాయకునితండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని సాగర్ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పేదలకు అందించింది ఇందిరమ్మ ఇళ్లే అని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఇంటిని కూడా నిర్మించలేదన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మరలా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను నిర్మిస్తున్నట్లు త్వరలోనే అన్ని గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం సాగర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, పీడీ రాజ్‌కుమార్, ఎంపీడీవో మల్లేశ్వర్, తహసీల్దార్ అనిల్, నియోజకవర్గ నాయకులు మెరావత్ మునినాయక్, లాలు నాయక్, మెరావత్ బిచ్చాలు, నాగేందర్ పాల్గొన్నారు. కాంగ్రెస్ హాలియా మండలాధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో సుజాత, వైస్ చైర్మన్ కాంసాని చంద్రశేఖర్, డీసీసీ కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, యడవల్లి నరేందర్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, పసునూరి కిరణ్‌రెడ్డి, దేప తిరుపతిరెడ్డి, గడ్డం సాగర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సైదులు, అమరేందర్‌రెడ్డి, వెంకటనర్సిరెడ్డి పాల్గొన్నారు.



అనుముల మండలం కొరవినేనిగూడెంలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

కొనుగోలు కేంద్రం ప్రారంభం

హాలియా : మండలంలోని కొరివేనిగూడెం, పీఏసీఎస్ కొత్తపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు.ఐకేపీ, పీఏసీఎస్ అధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర రూ. 2,320 లభిస్తుందని, అదే సన్నధాన్యానికి అయితే రూ. 500 బోనస్ కూడా అందిస్తున్నామన్నారు. అలాగే అనుముల మండలం పేరూరు, వీర్లగడ్డ, కొత్తపల్లి, చల్మారెడ్డిగూడెం, పాలెం, చింతగూడెం గ్రామాల్లో అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

వాటర్ ట్యాంకర్ ప్రారంభం

హాలియా మున్సిపాలిటీలో రూ. 12. 95 లక్షలతో ఏర్పాటు చేసిన ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్‌ను ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, పీడీ రాజ్‌కుమార్, నాయకులు యడవల్లి నరేందర్‌రెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, చింతల చంద్రారెడ్డి, పిల్లి ఆంజనేయులు, చల్లా మట్టారెడ్డి, మజారుద్దీన్, సైదులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కడుపు నింపుతోంది



మిర్యాలగూడలో సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యంతో పేదల కడుపు నింపుతోందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని పలు కాలనీల్లో ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి గురువారం సన్నబియ్యం లబ్ధిదారులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు దారులకు గతంలో రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసిన దొడ్డురకం బియ్యం 40 శాతం వరకు దుర్వినియోగం అయ్యేవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పేదలకు సన్నబియ్యం పంపిణీ చేసుడడంతో వారు మూడు పూటల భోజనం చేస్తున్నామని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సన్నబియ్యం పేదలకు పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ సలీం పాల్గొన్నారు.

దేవరకొండలో అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి

దేవరకొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని సర్వేనంబర్ 750లో అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని దేవరకొండకు చెందిన వంశీ మోహన్ గురువారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అక్రమ నిర్మాణాలపై హైకోర్టులో పిటిషన్ వేయగా నాలుగు వారాల్లో చర్యలు తీసు కోవాలని మునిసిపల్‌శాఖను ఆదేశించినప్పటికీ పట్టించు కోవడంలేదని పేర్కొన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పించాలి : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కాకున్నా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరనైనా రైతులకు అందించరా? అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రశ్నించారు. మిర్యాలగూడలోని పార్టీ కా ర్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట ఉత్పాదక వ్యయం, దానికి అదనంగా 50 శాతం లెక్కించి రైతుల పంటకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు రూ. 500 బోనస్‌కు గుర్తింపు లేకుండా పోయిందన్నారు. అన్ని ఐకేపీ కేంద్రాల్లో ఆటోమేటిక్ ప్యాడీ క్లీనింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసి రైతుల ధాన్యాన్ని క్లీనింగ్ చేసి బోనస్ ధరకు విక్రయించుకునే విధంగా చూడాలన్నారు. రైతులు మిల్లర్లకు విక్రయించిన ధాన్యానికి బోనస్ కల్పించాలని అన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతుసంఘం అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు జగ దీశ్ చంద్ర, సీఐటీయూ నాయకులు తిరుపతి రాంమూర్తి, సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్, బవాండ్ల పాండు, పాదూరి గోవర్ధని పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

హాలియా, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరమని హాలియా మునిసిపల్‌మాజీ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమానరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇబ్రహీంపేటకు చెందిన పిల్లి సైదులు రూ. 60వేలు, అనుముల చిన్న ముసలయ్య రూ.20వేలు, రుద్రాక్షి వెంకటమ్మ రూ.60వేలు, ఈగల సౌజన్య రూ. 27వేలు, రేఖ ధనలక్ష్మి రూ.27 వేలు సీఎం సహాయ నిధి మంజూరయ్యాయి. సంబంధిత చెక్కులను లబ్ధిదారులకు గురువారం అందజేశారు కార్యక్రమంలో మార్కెట్ మాజీ డైరెక్టర్ ఎండీ అక్బర్‌ఖాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చాపల పెదవెంకన్న, ఈగల రాములు, నాదెండ్ల అంజి, లింగాల ప్రభాకర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

పెద్దఅడిశర్లపల్లి,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న నిర్వ హించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉమ్మడి మండలాధ్యక్షుడు యోల్గురి వల్లపురెడ్డి అన్నారు. గురువారం అంగ డిపేట ఎక్స్‌రోడ్డు వద్ద గల బీఆర్ఎస్ కార్యాలయంలో చలో వరంగల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సభకు లక్షలాదిమందిగా తరలివచ్చి వరంగల్ సభను విజయ వంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మునగాల అంజి రెడ్డి, అర్వపల్లి నర్సింహ, ఎర్ర యాదగిరి, శ్రీను, గోలి గిరి, బొడ్డుపల్లి మహేందర్, సుధాకర్ గౌడ్, దామోదర్, రమణంపల్లి వెంకటయ్య, వెంకన్న పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను ఉపసంహరించుకోవాలి



మిర్యాలగూడ మండలం ఆలగడపలో ధర్నా చేస్తున్న వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్ తదితరులు

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే ఉపసహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలోని ఆలగడప గ్రామంలో గురువారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఇప్పటికే నిత్యావసర ధరలు పెరగడంతో పేదల జీవన విధానం భారంగా మారిందని, కేంద్రం పెంచిన గ్యాస్ ధరలతో పేదలు మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో చము రు ధరలు తగ్గితే అందుకు భిన్నంగా దేశంలో ధరలను పెంచుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రవినాయక్‌పట్టెం చంద్ర య్య, పట్టేటి వెంకట య్య, బాచబోయిన పాపయ్య, సైదులు, నారాయణ, శ్రీను, కుమార్, వెంకన్న పాల్గొన్నారు.

నేడు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

డిండి : గ్యాస్ సిలిండర్ ధర పెంపునకు నిరసనగా సీపీఐ పిలుపుమేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బార్ అసోసియేషన్ మిర్యాలగూడ అధ్యక్షుడిగా సత్యనారాయణ





సత్యనారాయణ, భూపతిరెడ్డి

మిర్యాలగూడ లీగల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్ మిర్యాలగూడ అధ్యక్షుడిగా నేతి సత్యనారాయణ రెండో పర్యాయం ఎన్నికయ్యారు. స్థానిక కోర్టు భవనంలోని బార్ అసోసియేషన్ భవన్‌లో బుధవారం జరిగిన ఎన్నికలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మొత్తం 144 ఓట్లకు 139 ఓట్లు పోల్ అయ్యాయి. నేతి సత్యనారాయణకు 92 ఓట్లు, మైనం మహేష్‌కు 46ఓట్లు పోల్ అయ్యాయి. జనరల్ సెక్రటరీగా అలుగుబెల్లి భూపతిరెడ్డి తన ప్రత్యర్థి పొన్నూరు విజయసారథిపై విజయం సాధించారు. భూపతిరెడ్డికి 108 ఓట్లు విజయసారథికి 29 ఓట్లు పోల్ అయ్యాయి. పోటాపోటీగా సాగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా సత్యనారాయణ విజయం సాధించారు. ఆయన స్వగ్రామం వేములపల్లి మం డలం ఆగామోత్కూర్. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులుగా విజయం సాధించిన సత్యనారాయణ, భూపతిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తమపై నమ్మకంతో గెలిపించిన న్యాయవాదులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శి అలుగుబెల్లి భూపతిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుండి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ చలిమెల పద్మయ్య, ట్రెజరర్ వడ్డేటి సాయికుమార్‌యాదవ్, గేమ్స్ సెక్రటరీ కొంక వెంకన్న, లైబ్రరీ సెక్రటరీ బానాల ఉమాశంకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వాకిటి శ్రీనివాస్, కరణం లిం గయ్య, బాలునాయక్, గాయత్రీప్రసాద్. మహిళా ప్రతినిధిగా గంగాభవాని విజయం సాధించారు. ఎన్నికల అధికారులు ఏ చూరి శ్రీనివాస్, విగ్రహాల సుధాకర్ రావు,.పవన్‌కుమార్, సైదులు వ్యవహరించారు.

సంక్షిప్తంగా..

● కొండమల్లేపల్లి : మండలంలోని జోగ్యతండా సమీపంలోని సాలిడార్ బధిరుల ఆశ్రమ పాఠశాలలో గురువారం విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. పార్ బాయిల్డ్ రైస్ మిల్ అసో సియేషన్ అధ్యక్షుడు సముద్రాల వెంకటేశ్వర్లు-సరిత దంపతుల కుమార్తె పూజిత జన్మదినాన్ని పురస్కరించుకొని అన్నదానం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి : దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శుక్రవారం పీఏపల్లి మండలంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్యయాదవ్ గురువారం తెలిపారు. ఉదయం 9 గంటలకు అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని, అలాగే కస్తూర్బా గాంధీ పాఠశాలలో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

● మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని పెద్దబజార్ శ్రీరామమందిరంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నదానం నిర్వహించి సీతారామచంద్రుల విగ్రహాలకు పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. అన్నప్రసాదానికి సహకరించిన నాగుబండి చంద్రశేఖర్-విజేత దంపతులు, తెడ్ల జగన్, అశ్విక, నాగుబండి భాగ్యలక్ష్మి ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రంగా లింగయ్య, రేపాల అంతయ్య, కుక్కడపు రాంమూర్తి, గుంటూరు చంద్రశేఖర్, జయిని రాజు, చిట్టిపోలు లింగయ్య, గంధం శ్రీనివాస్, శేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : కేరళ రాష్ట్రంలో త్రివేండ్రంలో గత నెల 28న నిర్వహించిన చెవుడు, మూగ విద్యార్థుల క్రీడా పోటీల్లో కొండమల్లేపల్లి మండలంలోని జోగ్యతండా సమీపంలోని సాలిడార్ బధిరుల పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని పాఠశాల నుంచిస్థానిక చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీలో కొండమల్లేపల్లి ఎస్ఐ పాల్గొన్నారు. కార్యక్రమలో పాఠశాల నిర్వాహకుడు భాస్కర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

● హాలియా : పోషణ పక్వాడలో భాగంగా అనుముల మండలం హజారీగూడెం గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత ఆధ్వర్యంలో గురువారం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా శిశువుల్లో ఇన్‌ఫెక్షన్ నివారించడానికి, చేతులు కడగడం పైన కమ్యూనిటీకి అవగాహన కల్పించారు.

● చింతపల్లి : గర్భిణులు , బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ తెలిపారు. మండలంలోని చాకిలిశేరుపల్లి, గొడుకొండ్ల వీ.టి.నగర్ అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీచర్ షమీం పాల్గొన్నారు.

● దేవరకొండ, : దేవరకొండలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీచైతన్య స్కూల్ అనుమతులు రద్దు చే యాలని దేవరకొండ, కొండమల్లేపల్లి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు గురువారం డీఈవో భిక్షపతిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపాయి. దేవరకొండలో ఇటీవల శ్రీచైతన్య స్కూల్ కొత్త భవన నిర్మాణం ముదిగొండ రోడ్డులో వరుణ్ కృష్ణ బార్ అండ్ రెస్టారెంట్‌కు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. విచారణ చేసి అనుమతులు రద్దు చేయాలని వారు వివరించారు. వినతిపత్రం అందజేసినవారిలో లక్ష్మీనారాయణ, రాజ్ కుమార్‌రెడ్డి, రామకృష్ణ, ఉన్నారు.

● దేవరకొండ : దేవరకొండ మునిసిపాలిటి పరిధిలోని పందుల పెంపకందారులు పందులను పట్టణాలకు దూరంగా పెంచుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్ అన్నారు. గురువారం దేవరకొండ మునిసిపాలిటీలో పందుల పెంపకందారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పట్టణానికి దూరంగా పందులను పెంచుకోవాలని సూచించారు.

● మాడ్గులపల్లి : కొనుగోలు కేంద్రాల్లోనే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని వేములపల్లి పీఏసీఎస్ చైర్మన్ జడ రాములుయాదవ్ అన్నారు. గురువారం మండలంలోని గండ్రవానిగూడెంలో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. . కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చింతకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మోసపోకుండా చూడాలి

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్



వెంచర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, కమిషనర్

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రజలు మోసపోకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని మునిసిపల్ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్‌శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని విఘ్నేశ్వర టౌన్‌షిప్‌ను మునిసిపల్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ లేఅవుట్లు, వెంచర్లను నిబంధనల మేరకు అనుమతించాలన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వెంచర్లకు వెళ్లి, పరిశీలించిన అనంతరమే అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణలో నిషేధి త స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆయనవెంట కమిషనర్ మహ్మద్ యూసుఫ్, అధికారులు సోమయ్య, అంజయ్య తదితరులు ఉన్నారు.